శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై! సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబూజీ కీ జై!



## ఒకే దైవం - ఒకే ధ్యానం - ఒకే ధ్యేయం

“గురువు-దేవుడు ఒకేసారి నా కనుల ఎదుట
నిలచినా నేనా దైవమును నాకు చూపిన
గురువుకే ముందుగా ప్రణమిల్లుతాను”
అన్న మహోత్కృష్టమైన ‘భక్త కబీరు’ సూక్తిని
ఒక సందర్భంలో ఓ సాధకుడు
ఓ మహాత్మునితో ప్రస్తావించగా,
వారు చిరునవ్వుతో ఇలా అన్నారు...
ఇంకా గురువు, దైవము ఇద్దరున్నారా బాబూ!
ఉన్నది ఒక్క గురువే!
గురువే దైవముగానున్నారు.



# గురుకృప

గురుపూర్ణిమ సంచిక

శరణమగు మాకు సద్గురు చరణయుగము



శ్రీసాయినాథుని విశిష్టత గురించి శ్రీబాబూజీ ప్రస్తావిస్తూ, "సాయితత్త్వంలో ప్రధానంగా సాయియొక్క లీల, సాయియొక్క బోధ అంటూ రెండుగా లేవు. ప్రపంచ ఆధ్యాత్మిక చరిత్రలో ఎందరో మహనీయులు ఉద్భవించారు. వారు ఆదర్శప్రాయమైన జీవితాన్ని గడిపారు, ఎట్లా గడపాలి అనే దానిని మనకు తెలియచేసారు. వారి బోధ, వారి జీవితం, ఆచరణ... ఇన్ని ఉన్నాయి. కానీ బాబా విషయంలో .... ఆయనెక్కడా ఉపన్యాసాలు ఇవ్వలేదు, పుస్తకాలు వ్రాయలేదు, సత్సంగాలు చేయలేదు,  గోష్ఠులు నిర్వహించలేదు, వేదాంతం గురించి అసలే మాట్లాడలేదు. అయినప్పటికీ కూడా ఆయన శిరిడీలో 16 ఏళ్ళ బాలునిగా కనిపించి 1918లో మహాసమాధి చెందేవరకు ఆయన చేసినటువంటి ప్రతిచర్య కూడా ఆయన బోధే. కాబట్టి సాయి యొక్క లీలను, సాయియొక్క తత్త్వాన్ని వేరుపరచి ఇది సాయి యొక్క జీవితచరిత్ర, ఇది సాయియొక్క బోధ అని చెప్పడం చాలా కష్టమైన విషయం. పువ్వుకు పరిమళం ఎలా ఉంటుందో, చక్కెరకు తీపి ఎలా ఉంటుందో అట్లాగే బాబా జీవితంలో అణువణువులోనూ-ఆయన ఎవరు, ఆయన రూపం, ఆయనెట్లా ప్రకటమయ్యారు, ఆయన ప్రతి కదలికా ఒక సత్యాన్ని మనకు తెలియచేస్తుంది" అంటారు.



సంపుటి : 24
సంచిక : 3



జూలై 23
2021

గురుకృప



# సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి!
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయకుహరంలోని నిశ్శబ్దనిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞానసౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞానసౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞానసౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏకకంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధురస్వప్నం.
ఆ స్వప్నసాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

- శ్రీబాబూజీ

## లోపలి పేజీలలో

4 గురువు ఆదర్శం - ఆదర్శాల దర్శనమే నిజదర్శనం
- గురుకృప

6 గురువు
- 'సమ్మోహనం' స్ఫూర్తితో

8 సూత్రధారి
- శ్రీమద్భాగవతం దివ్యజీవన మార్గము

10 నిష్ఠ - సబూరి
- శరచ్చంద్రికలు

15 దిశ మార్చి చూడు
- నీలంరాజు లక్ష్మీప్రసాద్

17 నైతిక విద్య - ఉపాధ్యాయ పాత్ర
- మన విలువలు' నుండి

18 ఆ చేయి ఎంత హాయి
- డా॥ ఎస్. సాయివరప్రసాదరావు

27 గురుకృపాలహరి
- గురుకృప



నిర్వహణ : గురూజీ ఆశీస్సులతో - గురుబంధువులు

GURUKRUPA
Printed at : Ramakrishna Printers, Visakhapatnam. Web : www.gurukrupa.info



# గురువు ఆదర్శం - ఆదర్శాల దర్శనమే నిజదర్శనం

మనం ఏ పనిచేసినా మన శక్తి సామర్థ్యాలను సంపూర్ణంగా వినియోగించుకొని, నేర్పుగా పరిపూర్ణంగా చేయాలన్న స్ఫూర్తిని తమ ఆచరణ ద్వారా కలుగచేసేవారు శ్రీబాబూజీ. ఏ పనైనా సరే అది పూర్తయ్యేవరకు వారు శక్తివంచన లేకుండా అహర్నిశలు అవిశ్రాంతంగా శ్రమించి, ఏకాగ్రదృష్టితో చేసేవారు. వారు చేసే ఏ పని అయినా దాని నేపథ్యం బాబానే. బాబాపై ఉన్న అపారమైన ప్రేమ వారిని అట్లా పని చేసేలా చేస్తుంది. ఏ పనైనా మొదలు పెడితే సంపూర్ణంగా (చివరికంటా) చేయాలనే వారు శ్రీసాయి. అందుకే గురువుని చేతల వేదాంతి అన్నారు. మాటల వేదాంతి కాదు. వేదం అంతా చెప్పినది కర్మకాండ గురించే. వేదమంతా యజ్ఞయాగాదుల గురించే. మనం చేసే పనులను యజ్ఞంలా చేయాలన్నదే వేద పరిభాష. కనిపించే దైవాలకు కృతజ్ఞత వేదం చెప్పినది. వేదాలలో కనిపించే పంచభూతాలకు కృతజ్ఞత–కంటికి కనిపించే బాబా పట్ల వారికున్న ప్రేమ–కృతజ్ఞత. బాబా చెప్పిన మాటను శృతిప్రమాణంగా స్వీకరించి, అనుసరించడానికి ఆచరించేలా చేసింది. అది బాబాలో వారు దర్శించిన ఆదర్శం. అదే నిజదర్శనంగా, ఆ దర్శన స్ఫూర్తితో ప్రేమను వ్యక్తీకరించే మార్గంగా ఆ మాటను ఆచరణయుక్తం చేసారు. అది మన గురువుగారి ఆదర్శంగా మనం దర్శించి, గ్రహిస్తే, అనుగుణవర్తనానికి మార్గాన్ని వారు నడిచి చూపారు. అందుకే అది సులువైనది, సులభమైనది. అందుకే వారి (బిడ్డలకు) భక్తులకు అది రాచబాటే.

“బాబా తమ గురువు అడిగిన రెండుపైసల దక్షిణ సమర్పించాను” అన్నారు. ఎలా సమర్పించారు అన్నది వారి జీవనంలో మనం దర్శిస్తే–అదే మనం కూడా బాబా అడిగిన రెండు పైసల దక్షిణ సమర్పించడానికి మార్గం అవుతుంది. అది మన లక్ష్యమైననాడు ఆ మార్గంలో చివరికంటా (అంటే జీవితం మొత్తం) నడవగలం. అదే గురువుగారు చెప్పే సాధనలో జీవితం భాగం కావడం అంటే. బాబాను–గురువుగారిని ఎందుకు దర్శనం చేస్తున్నాం. ముందు మనకేం కావాలో తెలుసుకోవాలి అంటారు శ్రీబాబూజీ. మన అవసరాలన్నీ తెలిసిన వారు కనుక వాటి గురించి కాదుగా ఇక మనం ఆలోచించాల్సింది, మరి ఏమిటి? బాబా అడిగిన ప్రశ్న పరంగా ఆలోచించాలి. “ఎందుకు ఈ జీవితంలోకి వచ్చింది పిడకలేరుకోవడానికా, సద్గురువుని తెలుసుకో” అన్నది. సద్గురువుని తెలుసుకోవడం అంటే – అన్న ఆలోచన కదలాలి. వారు తెలుసుకోమంటున్నది రూపం గురించా? అంటే ఈ రూపమే నేను కాదు అన్నారు బాబా. “ఎవరైతే ఈ అయిదున్నర అడుగుల దేహమే బాబా



అనుకుంటే వారు నన్ను చూడనట్లే" అన్నారు కదా శ్రీసాయి. మరి వారి శక్తి సామర్థ్యాల గురించా అంటే ఇదంతా అల్లానే చేస్తున్నారు అంటారు శ్రీసాయి. అంతా బాబా వల్లనే మీకు అందుతున్నది అంటారు శ్రీబాబూజీ. మరి దీని నుండి మనం ఏం గ్రహించాలి? గ్రహించాలి అంటే దర్శనం చేయాలి. ఆ దర్శనం చేసి దానిని పొందేందుకు ప్రయత్నం చేయాలి. అపుడే దానిని మనం ఆస్వాదించగలం, రుచి చూడగలం. చూడటం అంటే ఆస్వాదన, వినడం అంటే అలా చేయడం అన్న అంతరార్థం తెలిసి అలా ఉండాలి. మన మాట విన్నాడు అని ఎప్పుడూ అంటున్నాం మన నిత్య జీవనంతో... ఎవరైనా మనం చెప్పింది పాటించినపుడే కదా! మరి ఆహార్యం గురించా? వారి ఆదర్శం గురించా? వారి ఆచరణాదుల గురించా? ఇట్టి ఆలోచనా, విచారణాదులే మన దృష్టిని, దృక్పథాన్ని మార్చేది. ఈ మార్పే మన ఆలోచనలోను, ప్రవర్తనలోను, ఆచరణలోను మార్పుకు దోహదం చేసేది.

బాబా దర్శనంతో కనీసం ఒక క్షణమో, ఒక నిమిషమో ఆనందాన్ని పొందాం. అట్టి వీటిని నిరంతరం నేను పొందాలి అన్న ఆలోచన మనలో కలగాలి. అందుకు ఏది మార్గం? అన్నది ప్రశ్న. బాబా (ఇచ్చిన) వరప్రసాదమైన ఈ జీవితాన్ని ఆనందమయం చేసుకోవడం ఎలానో చెప్పక విడచిన విషయం లేదంటున్నారు గురువుగారు. అందుకు సులువుగా శ్రీబాబూజీ మనకందించిన, సూచించిన సాధనా మార్గలలో ప్రధానమైనవి సత్సంగం, స్మరణ, పారాయణ గురువుగారు సూచించిన మార్గాలన్నీ అందరికీ సులభమైనవి, ఆచరణాత్మకమైనవి. అవి ఎలా చేసుకోవాలో కూడా వారు వాచానే కాక తమ ఆచరణ ద్వారా మనకు చెప్పారు, చూపారు. ఇక మనం వేయాల్సిన అడుగే ఉంది. ఆ ఒక్క అడుగువేస్తే, ఇలా మనం వేసిన ప్రతి అడుగు మనకు ఫలితాన్నిస్తుంది. అదే గురువుగారు చెప్పే మార్గమూ ఆనందమే, పొందేది ఆనందమే – గమ్యమూ ఆనందమే. Happiness through Happiness అని. మనం వేసే ప్రతి అడుగు గమ్యంతో ఒక్కొక్క అడుగు తగ్గిస్తుంది. అట్టి గమనమే గమ్యానికి చేరువ చేస్తుంటుంది. మరలా గురువుగారు చెప్పిన మాటను గుర్తు తెచ్చుకుంటూ, "మన జీవితంలో జరిగే ప్రతీ సంఘటన సద్గురు లీలాప్రబోధమే. వారి చెంతకు చేరువు చేసుకునే ప్రణాళికలో భాగమే" అంటారు శ్రీబాబూజీ. ఇలా మన నిత్యజీవనంలో ఆలోచనల్ని, మాటలను, చేతలను, సంఘటనలను బాబాపరంగా అన్వయసమన్వయాలతో ఆచరిస్తుంటే ఆనందంతో ఆ మార్గాన నడచిన వారమవుతాం. ఇది జీవించడం అంటే. ఎవరైతే నిరంతరం ఆనందంగా ఉంటారో వారు సాయిపథంలో



ఉన్న దానికి గురుతు అంటారు శ్రీబాబూజీ. ఇలా జీవితాన్ని 'జీవిస్తూ' బాబా అడిగిన రెండుపైసల దక్షిణ 'శ్రద్ధా-సబూరీలనే' వికసించిన పుష్పాలను వారి చరణాల చెంతనుంచడమే ఆ'చరణాల' ఆరాధన (ఆచరణే ఆరాధన) అదే గురుపూజోత్సవం అప్పుడే మనం 'గురుపూర్ణిమ'ను ఆస్వాదించగలం. అట్టి స్థితిని, యోగ్యతను ఇచ్చేందుకే వారున్నది. వారి ప్రయత్నమంత అదే. అట్టి గురువుకు నమస్సులతో.. వికసించిన మానసిక పుష్పాన్ని సమర్పిద్దాం. ఇది ఎన్నటికీ వాడనిది. మహిమాన్వితమూర్తి దర్శనం ద్వారా పొందిన ఒకక్షణ ఆనందాన్ని పెంచుకునే ప్రయత్నం చేసి, మరలా గురుపూర్ణిమకు ఎంత పెంచుకోగలిగామో అన్న ఆలోకన అవలోకనమే... గురువుగారు చెప్పే సింహావలోకనం. అదే మన వార్షిక గురుపూర్ణిమ ఉత్సవంలో మనం చేయవలసినది.

**- గురుకృప**

# గురువు

"కోరిమమ్ము ఏలినట్టి దైవమా" అన్నమయ్య కృతి. భగవానుడు తాను కోరి భక్తులను ఏలుతాడు. ఇది అక్షరసత్యం. అట్టి పనిని చేయడానికై భగవంతుడు గురువుగా భూమిపైన అవతరిస్తున్నాడు. ఇది అనుభవైక వేద్యం. ఇలా గురువుగారు మనలను కాచిన తీరు, మలచిన వైనం చూస్తే "కోరి మమ్ము ఏలినట్టి దైవం" అన్న సత్యం అనుభవంలోకి వస్తుంది. ఇదే బాబా చెప్పినది. "ఎవ్వరూ వారంతట వారుగా రారు, నేనే వారిని రకరకాల మిషతో రప్పించుకుంటాను" అన్నది.

మహాత్ముల సన్నిధిన సాధకుడు పొందిన అనుభవములు కేవలం ఆ ఒక్కనికే పరిమితమైనవి కావు. మహాత్ముల సాన్నిధ్యం పొందగోరెడి వారలకు అవి మార్గదర్శకములు. మహాత్ముల జీవితమే మనకు మార్గం అంటారు పెద్దలు. అందుకే ఆయా సంఘటనలు స్మరించుకున్న మాత్రముననే వారి సన్నిధి లభిస్తుంది. సాధకులకు చేదోడై నిలుస్తాయి. అందుకే "చెంతకు వచ్చిన ప్రతివారిని ఆదరించు" అన్నారు శ్రీసాయి.

సూర్యుని గురించి తెలిసిన వారెందరో, తెలియని వారందరు. సూర్యుని ఆత్మీయమైన వెచ్చని కిరణాలు మన మీద పడితే సూర్యుడు నాకు కూడా తెలుసు అని చెప్పడంలా ఉంటుంది మనమే 'గురువు తెలుసు' అని చెప్పడం. గురువు గురించి ఒక్క మాటలో చెప్పాలంటే "ప్రేమస్వరూపుడు". అందుకే గురువుగారు అంటారు-"మన కోరికలు ఎందుకు బాబా తీరుస్తున్నారంటే-ప్రేమవల్ల,



ప్రేమతో. సాధన అంటే "సర్వే సర్వత్రా బాబాను దర్శించడమే" (చూపుతాకిన చోట చొక్కముగనీవే –శ్రీబాబూజీ). లక్ష్యం ఏమిటి అంటే చెంతకు వచ్చిన ప్రతి జీవిని ఆదరించడం. గురువుగారిని చూసినవారెందరో ఉన్నారు. చూడాలనుకొని చూడలేకపోయిన వారూ ఉన్నారు. చూడని వారూ ఉన్నారు. చూసామనుకుంటూనే వారి అసలు స్వరూపాన్ని చూడగలిగినవారెందరు? వారి అసలు రూపు ప్రేమ, ఆనందం, కరుణ, దయ, తృప్తి... ఇత్యాదులను నిత్యం, నిరంతరం స్మరించుకోవడానికి (స్మరణ), గుర్తుంచుకోవడానికి (పారాయణ), అనుగుణంగా వర్తించడానికి సత్సంగాదులు. వీటిని మన నిత్యజీవనంలో ఉపయోగపెట్టుకోవడమే "ఒక్క అడుగు".

వారి లీలలన్నీ వారి మహిమ వర్ణనకు కాదు. అది జరగడానికి కారణం వారి ప్రేమ, కరుణ, ఆనందాలే, అవి ఏ కొంతైనా మనకు అబ్బటం కోసం సత్సంగం, స్మరణ, పారాయణాదులు అన్నది వాటిని సద్వినియోగం చేసుకుందాం. వారి పాదం పట్టిన ప్రతి వారి స్మృతిపథంలో అనుభవాల దొంతరలు ఉన్నాయి. ఆ అనుభవాల వెనుక ఉన్న గురువుగారి ప్రేమ, కరుణ, ఆనందాలను చవిచూపడానికే "పంచుకోవడం". ఆ పంచుకున్న ప్రతిదీ మనలో ఆ ప్రేమను, కరుణను, ఆనందాన్ని పెంచిననాడే మనం పంచుకున్న దానికి గుర్తు. ఇదే మనకు మైలురాయి.

గురువు–ఈశ్వరుడు బాబానా, శ్రీబాబూజీనా, గురువుగారా... పేరేదైతేనేం పిలుపేదైతేనేం.. ప్రేమ, కరుణ, ఆనందాలే రూపంగా గల ఆ భగవత్ స్వరూపాన్ని 'గురువు'ని మనసులో నిలుపుకునే ప్రయత్నంలో భాగమే నిత్యమూ మనమాచరించే పూజాదికాలైనా, ఆరాధనోత్సవాలైనా, సత్సంగాలైనా, స్మరణలైనా, పారాయణలైనా. ఆ లక్ష్యసాధనలో మనల్ని మనం ప్రశ్నించుకుంటూ, తరచి తరచి చూసుకుంటూ జీవితాన్ని సరిదిద్దుకుంటూ, తీర్చిదిద్దుకునే ప్రయత్నానికి వారి కృపను వేడుకుంటూ వారి బిడ్డలమవుదాం. అనుగ్రహవంతులమవుదాం.

**– 'సమ్మోహనం' స్ఫూర్తితో**

***"సాయిభక్తులకు శ్రీసాయినాథుడే దైవం, సాధన, మార్గం, గమ్యం" అంటూ ఏకదేవతోపాసన ప్రాముఖ్యాన్ని వివరిస్తూ, బాబాయే ధ్యానానికి ఆలంబనై నిలిచే సాధనా మార్గాలను ప్రబోధించి, సర్వదేవతా స్వరూపులైన బాబాను త్రికరణశుద్ధిగా ఆరాధించి, ప్రేమించే విధంగా భక్తుల అంతరంగాన్ని తీర్చిదిద్దుతూ... బాబా పైనే ఆధారపడి జీవించడం ఎలానో తమ జీవితాంతం ఆచరించి చూపారు శ్రీబాబూజీ.***



# సూత్రధారి

వ్యాసభగవానుని విశాలనేత్రాలు తృప్తితో మిలమిలా మెరుస్తున్నాయి. ఆయన కనులముందు ఇంకా ఆ ఘట్టమే. ద్రౌపదికి సంబంధించిన ఆ ఘట్టమే ద్రౌపదిలోని సౌజన్యాన్ని నిండుగా వ్యక్తం చేసిన ఆ ఘట్టమే కదలాడుతున్నది. ఏమా ద్రౌపది! ఏమా సౌజన్యం! ఏమా పరిపూర్ణత! ఏమా పరిమళభరితమయిన మానవీయత! ఏమయినా వదిలిపెట్టవచ్చు. ఎవరినయినా వదిలిపెట్టవచ్చు. కానీ, శత్రుత్వాన్ని వదిలిపెట్టడం, శత్రువును వదిలిపెట్టడం అంత తేలిక కాదు. (అశ్వత్థామ పన్నాగంతో ద్రౌపది బిడ్డలైన ఐదుగురు ఉపపాండవులను మట్టుబెడతాడు. అశ్వత్థామను చెరబడతారు పాండవులు). కానీ ఆమె వదిలి పెట్టగలిగింది. అదే ఆమెలోని విశేషం. ఆమె నుండి గ్రహించుకొని మానవాళి అలవరచుకోవలసిన విశేషాంశమిదే. అంత బాధలో కూడా ఆమె అశ్వత్థామకు ఒక తల్లి ఉన్నదని, అశ్వత్థామకు ఏమయినా అయితే ఆమె తల్లడిల్లి పోగలదని ఆమె గ్రహించగలిగింది. కాస్తంత కోపం వస్తేనే ఒడలు మరచిపోతాడు మానవుడు. కాస్తంత బాధ కలిగితేనే వివశుడయిపోతాడు మానవుడు. మరి అలాంటిది, అంతటి బాధలో ద్రౌపది అలా ఎరుక కలిగి ప్రవర్తించడం నిజంగా ఆశ్చర్యం! మానవజన్మకు పరమావధిని, మానవత్వానికి పరాంకోటి స్థితిని ఆమె చూపినట్లయింది.

మానవుడా! ఎలాంటి పరిస్థితులలో కూడా నీవు మానవుడిగానే ప్రవర్తించడం నేర్చుకో. సర్వకాల సర్వావస్థలయందు మానవుడిగా ప్రవర్తించగలగడం అన్నదే మానవుడు చేయవలసిన ఒక మహాతపస్సు సుమా! అని ఆమె మానవజాతికి ఉపదేశించినట్లయింది. సహృదయత అంటే ఇదేనేమో! ప్రేమ అన్న పదానికి అర్థమిదేనేమో! **"ఆత్మౌపమ్యేన సర్వత్ర"** అంటూ గీతలో కృష్ణపరమాత్మ చేసిన ఉపదేశానికి నిండయిన ఉదాహరణ ఇదేనేమో! మరి తానంత బాధపడుతూ కూడా తనలాంటి బాధ అశ్వత్థామ తల్లికి కూడా కలగడానికి అవకాశముందని గ్రహించి – "నేననుభవిస్తున్నాను చాలు. ఇలాంటి బాధ ఇంకెవరికి వద్దు. చివరకు ఈ బాధను కలిగించిన వారికి కూడా! వారి వారికి కూడా. ఇలాంటి బాధ వద్దు. అనుభవిస్తున్న నాకు తెలుస్తున్నది ఈ పుత్రశోకమెంతటిదో. ఈ స్థితిలో, ఈ నా స్థితిలో ఇంకెవరూ నిలబడటాన్ని నేను ఊహించలేను. అలాంటిది జరుగకూడదు. అందునా నా వల్ల అసలు జరుగకూడదు" – అని ఆమె అనగలిగిందీ అంటే ఇంతకంటే **'ఆత్మౌపమ్య'** స్థితి ఇంకెక్కడ జరుగుతుంది? ఈ ద్రౌపది ఎంతటి భాగవతమూర్తి! ఈమె జీవనవిధానం మానవజాతికి ఎంతగా మనుగడను నేర్పుతున్నది. భాగవతమూర్తిగా ఈమెను దర్శిస్తున్నపుడు నా ఒడలు ఎంతగా



పులకిస్తున్నది! కలియుగాంతం వరకు ఈ దృశ్యం మానవజాతిని ఇలా పులకింపచేస్తూనే ఉంటుంది. మానవత్వాన్ని వారిలో చిగురింపచేస్తూనే ఉంటుంది. నాకిప్పుడు ఎంతో సంతోషంగా ఉంది. కలి ప్రభావాన్ని గూర్చిన తలంపులో బరువెక్కిన నా మనస్సును మహత్తరమయిన తన మహతీనాదంతో స్పృశించాడు నారదుడు. తన పూర్వగాథను విప్పి చెప్పి ఒక అపూర్వమయిన స్థితిలో నన్ను నిలబెట్టాడు. అపూర్వమయిన స్థితిలో నిలబడిన నాకు అపురూపమైన ఆ దృశ్యం కనుల ముందు సాక్షాత్కరించింది. సాక్షాత్కరించి, నన్నెక్కడికో తీసుకొని వెళ్ళిపోయింది. మానవత్వపు లోతులెన్నింటినో మనస్సునకు అందేట్లు చేసింది. 'కాయ పండితే పండయినట్లుగా, మనిషి పండితే దేవుడు అవుతాడు" – అని నాకు స్పష్టమయింది. *(మనిషి దైవంగా ఎదగడం బాబా మతం)*

ద్రౌపదిది మొదటినుండి కూడా మామూలు దృష్టికి అంతుపట్టని వ్యక్తిత్వమే. అందరిలాగే ఆమె ఆవేశపడుతుంది. కానీ ఆ ఆవేశానికి ఒక అర్థముంటుంది. ఆ ఆవేశంతో ఆమె ఒక పరమార్థాన్ని సాధించుకుంటుంది. ఆవేశపడుతూనే అవగాహనలోనికి వెళ్ళిపోతుంది. ఆ అవగాహనలో నుండి నడుస్తున్న సన్నివేశానికి పరిష్కారాన్ని చూడగలుగుతుంది. ఇది నిజంగా చిత్రమే. ఆవేశపడే వాళ్ళు ఎందరో ఉంటారు. ఆ ఆవేశపడుతూనే కావలసిన అవగాహనలోనికి ప్రవేశించగలిగిన వారు ఎందరుంటారు?

ఆమె ఉద్భవించింది యజ్ఞవాటికలో నుండి కదా! యజ్ఞార్థదృష్టి అన్నది ఆమెకు జన్మతోనే అలవడినట్లున్నది. మనిషన్నవాడికి మనస్సుంటుంది. అసలు మనస్సుండబట్టే అతడు మనిషవుతున్నాడు. మనస్సున్న తరువాత ఆవేశాలు, ఉద్వేగాలు ఉంటూనే ఉంటాయి. అయితే ఈ ఆవేశాల ద్వారా, ఉద్వేగాల ద్వారా మానవునిలోని మానవత్వం వికసించాలే తప్ప ముకుళించుకుపోకూడదు. మనస్సును వికసింపచేసే ఆవేశాలు, ఉద్వేగాలు మనిషికి ఎప్పుడూ అవసరమే. ద్రౌపది యొక్క ఆవేశాలూ, ఉద్వేగాలూ అలాంటివి. ఆమె తన ఆవేశ, ఉద్వేగాలతో ధర్మం వైపుకు మరింత దీక్షగా చూడగలుగుతుంది. మరింత గాఢంగా ఆ ధర్మాన్ని పట్టుకోగలుగుతుంది. అందుకే ధర్మరాజుకు ఆమె అంటే అంత గౌరవం. అందుకే కుంతీదేవికి ఆమె అంటే అంత వాత్సల్యం. అందుకే శ్రీకృష్ణునికి ఆమె అంటే అంత ఆత్మీయత. వారందరి మీదుగా మనం ఆమెను చూడగలగాలి. అపుడు ఆమె అంటే ఏమిటో మనకు మరింత అర్థమవుతుంది. వారిలాగా మనం చూడగలగాలి. అప్పుడు మానవీయమయిన ఆవేశాల మధ్య నుండి మెరుపుతీగలా ఆమె ఎలాగ సాగిపోయిందో మనకు బోధపడుతుంది.

**– శ్రీమద్భాగవతం – దివ్యజీవన మార్గము నుండి**



# నిష్ఠ - సబూరి - ఆగష్టు 2011



రాధాబాయి దేశ్‌ముఖ్ యను ఒక ముసలమ్మ వుండెను. ఆమె ఖాశాబా దేశ్‌ముఖ్ గారి తల్లి. బాబా ప్రఖ్యాతి విని ఆమె సంగమనేరు గ్రామ ప్రజలతో కలసి శిరిడీకి వచ్చెను. బాబాను దర్శించి మిక్కిలి తృప్తి చెందెను. ఆమె బాబాను గాఢంగా ప్రేమించెను. బాబాను తన గురువుగా చేసికొని ఏదైనా ఉపదేశమును పొందవలెనని మనోనిశ్చయము చేసికొనెను. ఆమెకింకేమియు తెలియకుండెను. బాబా ఆమె సంకల్పమును ఆమోదించక తనకు మంత్రోపదేశము చేయనిచో ఉపవాసముండి చచ్చెదనని మనో నిశ్చయము చేసుకొనెను. ఆమె తన బసలోనే ఉండి భోజనము, నీరు మానివేసెను. అట్లు మూడు రోజులు గడిచెను. ఆమె పట్టుదలకు నేను (శ్యామా) భయపడి ఆమె పక్షమున బాబాతో ఇట్లంటిని. "దేవా! మీరేమి ప్రారంభించితిరి? నీవనేకమందిని ఇచ్చటకు ఈడ్చెదవు. ఆ ముదుసలిని నీవెరిగియే ఉందువు. ఆమె మిక్కిలి పట్టుదల గలది. ఆమె నీపై ఆధారపడి వున్నది. ఆమె చచ్చు వరకు ఉపవసించ నిశ్చయించుకొని వున్నది. నీవు ఆమెననుగ్రహించి ఉపదేశమిచ్చునంతవరకు ఆమె తన నిరాహారదీక్ష మానదు. ఆమెకేమైనా హాని జరిగినచో ప్రజలు నిన్నే నిందించెదరు. నీవు తగిన ఆదేశమివ్వకపోవుటచే ఆమె చచ్చినదని లోకులనెదరు. కాబట్టి ఆమెను కరుణింపుము, ఆశీర్వదించుము, ఆమెకు తగిన దారి చూపుము!" ఆమె మనోనిశ్చయమును చూచి, బాబా ఆమెను పిలిపించి, ఈ క్రింది విధముగా బోధించెను.

"ఓ తల్లీ! అనవసరమైన యాతనకేల పాల్పడి చావును కోరుచున్నావు? నీవు నిజముగా నా తల్లివి. నేను నీ బిడ్డను. నాయందు కనికరించి నేను చెప్పునది పూర్తిగా వినుము. నీకు నా వృత్తాంతమును చెప్పెదను. నీవు దానిని బాగా వినినచో నీకది మేలు చేయును. నాకొక గురువుండెను. వారు గొప్ప యోగీశ్వరులు; మిక్కిలి దయార్ద్ర హృదయులు. వారికి చాలా కాలము శుశ్రూష చేసితిని. కాని నా చెవిలో వారే మంత్రము నూదలేదు. నాకు వారిని వదలిపోవ తలంపే లేకుండెను. నేను వారితోనే యుండుటకు, వారి సేవ చేయుటకు, వారి వద్ద కొన్ని ఉపదేశములను గ్రహించుటకు నిశ్చయించుకొంటిని. కాని వారి మార్గము వారిది. వారు నా తలగొరిగించిరి; నా నుండి రెండు



పైసలు దక్షిణ యడిగిరి. నేను దానిని వెంటనే వారికి సమర్పించితిని. "మీ గురువుగారు పూర్ణకాములయినచో వారు మిమ్ములను దక్షిణయడుగనేల? వారు నిష్కాములని యెట్లనిపించుకొందురు?" అని నీవడుగవచ్చును. దానికి సమాధానము సూటిగా చెప్పగలను. వారు డబ్బును లక్ష్యపెట్టేవారు కారు. ధనముతో వారు చేయునదేమున్నది? వారు కోరిన రెండు కాసులలో ఒకటి నిష్ఠ, రెండవది సంతోష స్థైర్యములతో కూడిన ఓరిమి. నేనీ రెంటినీ వారికర్పించితిని. వారు ప్రసన్నులైరి. **– శ్రీసాయి సచ్చరిత్ర నుండి**

**గురువుగారు :** బాబా దక్షిణగా అడిగిన రెండు పైసలలో నిష్ఠ ఒకటి. **మన మనస్సును లక్ష్యంపై నిలుపుకొని, మనకు ఏం కావాలి? మనం ఎక్కడికి వెళ్తున్నాం? మనం ఏం చేస్తున్నాం?** అని మనల్ని **మనం ప్రశ్నించుకుంటూ ఆ లక్ష్యంపట్ల శ్రద్ధను కలిగి వుండటం అని దాని అర్థం.** ఎటువంటి పరిస్థితులు ఎదురైనా సరే, అవి మనకు రుచించినా రుచించకపోయినా, సంతోషదాయకమైనా కాకపోయినా **పట్టు వదలకుండా స్థిరచిత్తంతో లక్ష్యాన్ని అంటిపెట్టుకోవడమే నిష్ఠ.** ఏ యాచకునికైనా ఇది సహజం. వాస్తవానికి నిజమైన యాచకుడు పట్టు వదలడు. ఎవరైనా ఇవ్వకపోయినా లేదా అతనిని తరిమివేసినా అతను వెళ్లిపోడు. "అయ్యా! ఒక్క రూపాయి, ఒక్క రూపాయి" అని అడుగుతూనే ఉంటాడు తప్ప అతను కదలడు. తన లక్ష్యాన్ని అంటిపెట్టుకునే వుంటాడు. దానిని పొందడం కోసం వెంటపడుతూనే వుంటాడు. అతని దగ్గర నిష్ఠను నేర్చుకోండి.

బాబా అడిగిన రెండవ పైసా **సబూరి. సబూరి అంటే ఆనందంగా వేచి వుండటం.** అంతేగాని "ఇది మరీ విపరీతం. ఇక నా వల్లకాదు" అని వగచడమో లేదా ఊరికే విసిగిపోయి నిస్పృహ చెందడమో లేక అసహనంతో మధ్యలో వదలివేయడమో కాదు. **ఆనందంగా, ప్రేమతో సహనంతో వేచి వుండటం. అదీ సబూరి.**

**గురువుగారు :** శ్రీసాయి సచ్చరిత్రలో సిద్ధిక్ ఫాల్కే కథ వస్తుంది. అతను హజ్ యాత్ర ముగించుకొని బాబా వద్దకు వస్తాడు. అయితే బాబా అతనిని కనీసం ద్వారకామాయిలోనికి అడుగుపెట్టడానికి కూడా అనుమతించలేదు. తమను దూరం నుండి మాత్రమే దర్శించుకోవచ్చునని, అతను ద్వారకామాయిలోనికి మాత్రం అడుగుపెట్టనేకూడదని ఆదేశిస్తారు. దాంతో తొమ్మిదినెలల పాటు ఫాల్కే శిరిడీలోనే వేచి వుంటాడు.



నిజానికి అది ఎంతటి అవమానకరమో కదా! ఒక హాజీ మశీదులో అడుగుపెట్టలేకపోవడం - దానిని అతను ఎలా భావించి వుండాలి? అయినప్పటికీ హాజీ ఫాల్కే తొమ్మిదినెలలపాటు వేచి వున్నాడు. అతని ఓరిమి ఎంతటి ఉత్తమమైనదంటే అటు పిమ్మట అతను బాబాతో కలసి భోజనం చేసేవాడు. చాలా కొద్దిమందికి - కేవలం తొమ్మిది లేక పదిమందికి మాత్రమే ద్వారకామాయిలో కూర్చుని బాబాతో కలసి భోజనం చేయడానికి అనుమతి వుండేది. అయినా వారిలో ఒకరిగా ఫాల్కే ఎన్నుకోబడ్డాడు. అంతకు ముందు ఎంతగానో అగౌరవపరచబడ్డ వ్యక్తి - అదే అందరూ అనుకునే అగౌరవం - తరువాత ఎంతగానో గౌరవించబడ్డాడు. దానికి కారణం ఏమిటి? అతనికి ఆ గౌరవాన్ని అందించింది ఏమిటి? అతని ఓరిమి, అతని సబూరి. **అతని సబూరికి ఆధారభూతమైనది ఏమిటి? అతని ప్రేమ.** "నేను కనీసం ద్వారకామాయిలోనికి అడుగు కూడా పెట్టడానికి లేదు. ఇక నేను శిరిడీలో ఉండవలసిన అవసరం ఏముంది?" ఇలా అతను ఎప్పుడూ ఆలోచించలేదు. బాబా అతనిని ఎందుకు వేచి వుండేటట్లు చేస్తున్నారో అతనికి తెలుసు. అతను ఎదురుచూస్తూ, ఎదురుచూస్తూ, ఎదురుచూస్తూ ఉన్నాడు. చివరికి అతను కోరుకున్న దానిని పొందాడు. అదీ **సబూరి** అంటే.

**గురువుగారు :** నిష్ఠకు అర్థం నమ్మకం అని కాదు. వాస్తవానికి **నిష్ఠను 'అచంచలమైన పట్టుదల'** అని అనువదించాలి. అచంచలం అని ఎందుకు? ఎందుకంటే నీ ఇష్టాఇష్టాలు నిన్ను చలింపచేస్తుంటాయి కాబట్టి అచంచలం యొక్క భావం **న-ఇష్ట (వేరే ఇష్టాలు లేకపోవడం)**. ప్రతి ఒక్కరికి వారి వారి ఇష్టాయిష్టాలు, వ్యామోహాలు, తమవైన ప్రాధామ్యాలు వుంటాయి. సంస్కృతంలో ఇష్ట అంటే నచ్చినది, ఎంచుకునేది. అందుకని న-ఇష్ట ఇంటే ఇష్టం కానిది - ఎంచుకునేది కాదు, నచ్చినది కాదు. అంటే నీకున్నటువంటి అన్ని ఇష్టాల్లో మొట్టమొదటగా ఒక ఇష్టమంటూ మన ఆరాధ్యదైవం పట్ల (వున్న ప్రేమ) ఉండాలి. ఉన్నటువంటి అన్ని ఇష్టాల్లో ఒకేదానిని అంటిపెట్టుకొని ఉండటం నిష్ఠ. అదే బాబా అడిగిన అచంచల భక్తి. మనకు ప్రీతికరమైన లక్ష్యం పట్ల మన ప్రేమ పెరిగే కొలది మిగతా ఆకర్షణలకన్నా ఆ (లక్ష్యం పట్ల మనకున్న) ఆకర్షణ బలీయమై ప్రేమ అచంచలమవుతుంది. అప్పుడు ఈ ఆకర్షణ క్రమంగా మిగతా ఆకర్షణల నుండి నిన్ను దూరంగా లాగివేస్తుంది. అప్పుడు నీ ప్రేమ అచంచలమై సుస్థిరమవుతుంది. అదీ నిష్ఠ.



**భక్తుడు :** నిష్ఠ, సబూరి ఉంటే దుఃఖం పట్ల మన భావన మారుతుందా? లేక అంతర్లీనమైన లక్ష్యం వుండటం వలన మనకు ఆ బాధ నిజంగానే తక్కువగా ఉంటుందా (అనిపిస్తుందా?)

**గురువుగారు :** అసలు కష్టానికి, అలా కష్టపడటానికి గల కారణానికి మధ్య గల సంబంధాన్ని నువ్వెలా చూస్తున్నావు అనేదానిపై అది ఆధారపడి వుంటుంది. ఉదాహరణకు ఎయిర్‌పోర్టులో నీ యజమాని కోసం వేచి వుండటానికి, నీకు ప్రియమైన వ్యక్తి గురించి వేచి వుండటానికి గల తేడాను గమనించు. మీ యజమాని వస్తున్నాడు, అతనిని తీసుకురావడానికి నిన్ను పంపించారనుకుందాం. నువ్వు గుర్తింపు కార్డు పట్టుకొని వచ్చి అక్కడ నిలుచుని వుంటావు. అంతలో అనౌన్సర్, 'సాంకేతిక కారణాల వలన విమానం రెండు గంటలు ఆలస్యమవుతుంది' అని చెప్తారు. ఆ రెండు గంటలు నువ్వు ఎంత బాధపడతావో చూడు. వేచి వుండటం వలన నువ్వు విసుగు, చీకాకులకు గురవుతావు. ఆ రెండు గంటల సమయం ఎప్పుడెప్పుడు అయిపోతుందా అని అసహనంగా వుంటావు. కానీ అదే నీకు ప్రియమైన వ్యక్తి వచ్చే విమానం రెండు గంటలు ఆలస్యమయిందనుకో, నీవు వేచి ఉండాల్సినప్పటికి ఆ కష్టం వేరే రకమైనది. అది ఒక రకంగా నీకు సంతోషాన్నే కలిగిస్తుంది. నీ యజమాని విషయంలో నువ్వు అక్కడ వేచి ఉండకపోతే నీ ఉద్యోగాన్ని పోగొట్టుకోవలసి వస్తుంది. నువ్వు అక్కడ ఉండకపోతే ముందు ముందు దాని పరిణామాలు చాలా వుంటాయి. కానీ ఇక్కడ ఎటువంటి పరిణామాలు ఉండవు. నువ్వు కోల్పోయేదంటూ ఏమీ ఉండదు. విమానం నాలుగు గంటలు ఆలస్యమైనా సరే నువ్వు అక్కడే వుంటావు. ఎందుకని? ఎందుకంటే విమానం వచ్చిన తరువాత మన ప్రియమైన వ్యక్తిని మనం చూసినపుడు మనం ఎంతగా ఎదురుచూసామో అంతగా ఆనందిస్తాం. ఆ రెండుగంటల సమయం ఎదురుచూడటం సబబుగా అనిపిస్తుంది. ఇబ్బంది వుండదు. అక్కడ నిలబడి వుండటాన్ని నువ్వు ఆనందిస్తున్నావు కాబట్టి వేచి వుండటాన్ని కూడా నువ్వు ఆనందిస్తావు. 'నా ప్రియమైన వ్యక్తిని చూడబోతున్నాను' అన్న ఊహే నీకు ఆనందాన్నిస్తుంది. అలా ఎదురుచూడటం కూడా ఎంతో పరవశింపచేస్తుంది. మనం దానిని ఆస్వాదిస్తాం. నిజానికి ఇది వేచి వుండటం యొక్క లక్షణాన్ని సంపూర్ణంగా మార్చివేస్తుంది. నిజానికి అది వేచి ఉండటంలాగా వుండదు. అది ఎదురుతెన్నులు చూడటంలా వుంటుంది. మీకు ఈ రెండింటికీ తేడా తెలుసు కదా! మనకు ప్రియమైన వ్యక్తి కోసం ఎదురుతెన్నులు చూడటం. అదీ నిజమైన సబూరి.



**గురువుగారు :** న–ఇష్ట అంటే ఇష్టం లేకపోవడం. అక్కడ "నా ఇష్టం" అంటూ ఉండదు. నీ ఇష్టమంటూ, నీ ఎంపికంటూ ఉండదు. నువ్వు ఎందుకు వచ్చావు అన్న విషయాన్ని అన్ని వేళలా గుర్తుంచుకొని, నీ లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఎల్లప్పుడూ మనస్సును దానిపై లగ్నం చేయడమే నిష్ఠ. సదా సర్వదా ఆ జాగరూకత, ఆ జాగ్రత్త, ఆ ఏకాగ్రత – అదీ నిష్ఠ.

**గురువుగారు :** మనకు ప్రియమైన వ్యక్తి రైలులో వస్తున్నారు. అతన్ని కలుసుకోవడానికి మనం రైల్వేస్టేషన్‌లో ఉండాలి అనుకున్నామనుకోండి. ఆలస్యం కాకుండా ఉండటానికని రైలు వచ్చే సమయానికన్నా గంట ముందే మనం స్టేషన్‌కు వచ్చేస్తాం. అతన్ని చూడాలని ఎంతగానో ఎదురుచూస్తూ మనం ఆనందంగా వేచి ఉంటాం – అదీ సబూరి. అలా వేచి వున్నపుడు, అతన్ని స్వాగతించే క్రమంలో కొన్ని పనులను చేయవలసి వుంటుంది. రైలు వచ్చే ప్లాట్‌ఫారమ్ గురించి వాకబు చేయాలి. రైలు వచ్చే సమయం ఏమిటో కనుక్కోవాలి. ఏ బోగీలో వున్నారో తెలుసుకొని సరైన ప్రదేశంలో నిలుచుని సావధానంగా ఉండాలి. మనం రైలు వచ్చే వైపుకు ఎంతో ఆతృతగా చూస్తూ వేచి ఉండటం రైలును తొందరగా వచ్చేట్లు చెయ్యదు. కానీ రైలు వచ్చేటప్పటికి మనం తయారుగా ఉంటాం. రైలు వచ్చిన వెనువెంటనే మనకు ప్రియమైన వ్యక్తిని మనం చూడగలం. అతన్ని స్వాగతించడానికి సిద్ధంగా ఉంటాం. **సాధన అంటే ఇటువంటి సన్నాహాలే – "ఆనందంగా వేచి వుండటం" అనే కళ, సంసిద్ధత, గ్రహణ శక్తి అనే కళ.**

**భక్తుడు :** శ్రీసాయి సచ్చరిత్రలో ముందుగా బాబా గురువు బాబా తలను క్షవరం చేయించి తరువాత రెండు పైసలు అడిగినట్లు వ్రాసి వుంది. అంటే బాబా ఆలోచనలన్నీ తొలగిపోయిన తరువాత మాత్రమే ఆయన బాబాను నిష్ఠ, సబూరీలు అడిగారా?

**గురువుగారు :** తక్కినవన్నీ పోయిన తరువాత మిగిలేవే నిష్ఠ మరియు సబూరి. పరిపూర్ణమైన ప్రేమతో కూడిన శ్రద్ధతో గురువు వద్ద నిరీక్షించడం, అదీ నిష్ఠ మరియు సబూరి.

**భక్తుడు :** మిగిలేవి అవేనా?

**గురువుగారు :** అవును. మిగిలేవి అవే. వాస్తవంగా బాబా దగ్గర మిగిలిన రెండు పైసలు ఇవే – ఈ రెండూ కూడా దక్షిణగా సమర్పించవలసి వచ్చింది.

**– శరశ్చంద్రికలు**



# దిశ మార్చి చూడు

ఇన్నాళ్ళూ ఒక దిశగా నడుస్తూ వచ్చావు. ధనం సుఖమిస్తుందనుకున్నావు. నీ అదృష్టం కొద్దీ అది కావలసినంతగాను, మరింతగాను వచ్చిపడింది. కానీ దాని ద్వారా నువ్వాశించిన సుఖశాంతులు లభించలేదు, నీ ఆరాటం తీరలేదు. కీర్తి దక్కితే తృప్తి కలుగుతుందేమోనని ఎదురుచూసావు. ఎంతో ప్రయాసతో అదీ సాధించావు. అయినా నీలోని వెలితి అలాగే మిగిలిపోయింది. బహుశా ఇంకాస్త డబ్బు, మరింత కీర్తినార్జిస్తే సంతృప్తి కలుగుతుందేమో అనే కొన ఆశ మిగిలి ఉన్నది. కానీ అదీ నమ్మకం లేదు, నీకన్నా ధనికుడూ, నీ కంటే కీర్తిమంతుడూ అయినవాడు తారసిల్లినపుడు వారి మాటధోరణి వల్లనో, వాని రాతల ద్వారానో అతడు నీకన్నా ఎక్కువగా ఆరాటపడుతున్నాడని గ్రహిస్తావు. నీ స్వానుభవం ద్వారా కనుక్కున్నావు. ఇతరుల అనుభవాన్ని చూచి నేర్చుకున్నావు. ఇంకా అదే దిశగా ముందుకు సాగి, 'మరింత ధనం, కీర్తి' అని కలవరిస్తూ, అదే గాట్లో సాధించేదేముంది?

ఇలాంటి తరుణంలో, నీవెరుగని వాడు ఎవరో ఎదురై, "ఈ దిశగా నడిస్తే, నీకేమీ దక్కదు, నువ్వు ఎండమావులను చూచి భ్రమపడి తిరుగుతున్నావ్, ఇలాకాదు, ఇదుగో ఇటునడు. ఈ దిశగా వెళ్ళు" అని సలహా ఇచ్చాడు. అయితే ఈ ముక్కూ మొహమెరుగని పరదేశీయుణ్ణి నేనెలా నమ్మేది? అని నీ సందేహం, కానీ ఇన్నాళ్ళూ, ఇన్నేళ్ళు, నువ్వు నడిచిన దోవలో నీకేమీ దక్కలేదు. నీ ఆందోళన తీరలేదు. నీ అస్థిమిత భావం తొలగలేదు. అయినప్పటికీ అదే దిక్కున పయనించి, ఇకముందు మాత్రం ఏమి సాధించగలవు? పోనీ, ఈ పరదేశీయుడు చెప్పిన మాట విని చూస్తే ఏమవుతుంది? ఈ మనిషి నీ వద్ద ఏమీ ఆశించడం లేదే? ఏ యజ్ఞయాగాదులు, ఏ వరుణజపం కొరకై దానం చేయమనడం లేదే? ఏ సంస్థల్లో సభ్యుడిగా చేరి, తనని బలపరచమనడం లేదే? ఏమీ కోరని ఈ పరదేశీయుడు నీకు ఒక ఆప్తవాక్యం చెప్తున్నాడేమో? విని చూస్తే ఏమవుతుంది? ఇన్నాళ్ళు చేసిన ప్రయత్నమంతా నిరర్ధకమని తేలిపోయింది. ఇప్పుడితడి మాట విని ఇటు పయనిస్తే మాత్రం ఇంతకన్నా పోయేదేముంది?

నువ్వు వేసే మొదటి అడుగే చివరి అడుగంటున్నారు ఓ మహాత్ముడు. అంటే దిశ మారిందంటే, నువ్వు ఆ దిశన వేసే మొదటి అడుగే నీకు స్వేచ్ఛ యొక్క రుచి చూపిస్తుంది. ఇన్ని అడుగులు వేస్తే కానీ, ఇంత ప్రయాసపడితేగాని, అది లభించదు అనే కాలపరిమితికి లోబడడమంటూ ఉండదు.



నీవు ఆరోగ్యంవైపు మళ్ళావు. ఇక నీవు వేసే ప్రతి అడుగూ ఎక్కడికక్కడే నీకు ఫలితం చేకూరుస్తుంటుంది. సరియైన మార్గంలో నువ్వు వేసే ప్రతి అడుగూ నిన్ను సంపూర్ణ స్వేచ్ఛ వైపే తీసుకువెళ్తుంటుంది.

దిశ మారితే చాలు, దశ మారవచ్చు. ఒక వ్యక్తికి భగవంతుడిపై తీవ్రమైన అభినివేశం కలిగింది. భార్యకు నచ్చజెప్పి, సంసారం వదిలేసి అరణ్యానికి వెళ్ళి ఓ మర్రిచెట్టు కింద ప్రార్థన, భజన ప్రారంభించాడు. ఒకరోజున త్రైలోక్య సంచారి అయిన నారదమహర్షి అటు వచ్చినపుడు, ఆ భక్తుడు ఆయన్ని చూచి, చాలా సంతోషించి, "స్వామీ మీరు ముల్లోకాలు తిరుగుతుంటారు కదా? భగవంతుడిని కలిసినపుడు, ఆయన నాకెప్పుడు దర్శనమివ్వనున్నాడో కాస్త కనుక్కొని చెప్పండి" అని వేడుకున్నాడు. అలాగేనంటూ నారదుడు వెళ్ళి భగవంతుడితో "ఆ భక్తుడు తనకు మీ దర్శనం ఎపుడు లభిస్తుందో చెప్పమని అడుగుతున్నాడు" అని విన్నవించుకున్నాడు. శ్రీమహావిష్ణువు ఒక నిమిషం ఆగి, "ఆ భక్తుడు దురదృష్టవంతుడు నారదా, అతడు ఏ మర్రిచెట్టు కిందైతే కూర్చొని నన్ను భజిస్తున్నాడో, ఆ మర్రిచెట్టుకున్నన్ని ఆకులతో సమానమైన జన్మల అనంతరం కానీ నా దర్శనం లభించదు" అని నిట్టూర్చాడు.

మర్నాడు నారదుడు అరణ్యంలోకి వచ్చినపుడు భక్తుడు ఆత్రంగా, "భగవంతుడు ఏమని సమాధానమిచ్చారు స్వామీ?" అని అడిగాడు. నారదుడికి ఏమి చెప్పాలో తోచలేదు. ఇంత నిరాశాజనకమైన వార్త ఎలా చెప్పాలా అని ఆలోచిస్తున్నాడు. చివరకు "ప్రస్తుతం నీవు తెలుసుకోకుండా ఉండటమే మేలనిపిస్తున్నది" అన్నాడు. "చెప్పండి స్వామీ, మరేమీ ఫర్వాలేదు. ఉన్నమాటేదో నిస్సంకోచంగా చెప్పండి" అన్నాడు. నారదుడు కాస్త తటాపటాయిస్తూనే, శ్రీమహావిష్ణువు అన్న మాటలు ఆ భక్తుడికి చెప్పాడు. ఆ మాటలు విన్న భక్తుడు సంతోషంతో గంతులేయడం చూచేసరికి నారదుడికి ఆశ్చర్యమయింది. "ఓయి పిచ్చివాడా, నీకు దర్శనమిస్తానన్నది ఎన్నో జన్మల తర్వాతగదా? అప్పుడే ఏదో దక్కినట్లు ఈ గంతులేమిటి?" అని అడిగాడు. "ఎన్ని జన్మలైతేనేమి స్వామి? అసలు దర్శనమిస్తానన్నాడు కదా? అంతకన్నా అదృష్టమేముంటుంది? ఎప్పటికైనా నాకు కావలసింది ఆయన దర్శనమొక్కటే. **అది నాకు దక్కుతుందనే హామీ దొరికింది. అదే చాలు ఈ జన్మకి**" అంటూ మళ్ళీ గెంతనారంభించాడు. చిత్తమీవిధంగా భగవంతుని యందు లగ్నమై, వృత్తి పరమాత్మ మగ్నమైన తోడనే శ్రీమహావిష్ణువు అక్కడికక్కడే ఆ భక్తుడికి దర్శనమిచ్చాడు.



అక్కడే ఉన్న నారదుడు ఆశ్చర్యచకితుడై భగవానునితో, “ఓ నల్లనివాడా, నీవు చాలా మోసగాడవు. ఇది ఏమిటయ్యా, నన్ను కూడా బోల్తా కొట్టించావే? ఆ మఱ్ఱిచెట్టుకు ఉన్నన్ని ఆకులతో సమానమైన జన్మలెత్తితే కానీ ఈ భక్తుడికి దర్శనమివ్వనంటివి? మరి ఇదేమిటి? ఈ క్షణానికి ఈ క్షణం ఇతడికి దర్శనమిచ్చావు?” అన్నాడు.

“నిజానికి అతడి ప్రారబ్ధమట్లుండెను నారదా, కానీ భక్తి అనే త్రాటితో నన్ను కట్టినతోడనే నేను భక్త పరాధీనుడనవక తప్పలేదు” అన్నాడు. అంటే పురుషార్ధంతో, ఈ ప్రారబ్ధం ఇట్లే మారిపోయిందన్న మాట. **శ్రద్ధాసక్తులతో తీవ్రాభినివేశంతో మొదటి అడుగు సరియైన దిశలో వేయడం ప్రధానం.** ఆ తర్వాత ఎవరి అదృష్టం ఎలా ఉంటుందో ఎవరు చెప్పగలరు? అలా కాక ఇప్పుడు మనం వెళుతున్న దిశలో మరెన్ని వేల అడుగులు వేసినా దక్కేది మృత్తికే.

*– నీలంరాజు లక్ష్మీప్రసాద్‌గారి ‘ఆలోకన’ నుండి*

## నైతిక విద్య - ఉపాధ్యాయ పాత్ర

భారతీయ సంస్కృతి యందు గురువునకు అత్యున్నత స్థానం ఉన్నది. అనాదిగా మన దేశంలో గురువును దైవ సమానంగా భావించి, గౌరవించి, పూజించడం మన సాంప్రదాయం. **“గురువు లేక విద్య గురుతుగా దొరకదు”** అని వేమన యోగి పలికినట్లు గురువు లేకుండా “విద్య” సంపూర్ణము కాదు, సఫలీకృతం కాదు. **గురువే గురుతు అంటారు రమణులు.** నైతిక విద్యను అటు తల్లిదండ్రులు, ఇటు ఉపాధ్యాయులు కలిసి పిల్లలకు అందించాల్సి ఉన్నది. **“తల్లి ఒడి మొదటి బడి, నాన్న ఒడి నేర్పు నడవడి”.** అంతియే కాదు **“ఇల్లే పిల్లలకు మొదటి విద్యాలయం, తల్లిదండ్రులే మొదటి గురువులు”**. సంస్కార విద్యను అందించుటలో వారు కనబరచే శ్రద్ధయే పిల్లలను ఉత్తమ పౌరులుగా మలచగలదు.

అనుకరణ, అనుసరణ, ఆచరణ, అనుసృజన అనునవి అభ్యసన సోపానములు. పిల్లలు పెద్దలను అనుకరిస్తారు. కనుక వారి నడవడి, తీరుతెన్నులు సరిగ్గా ఉండాలి. తర్వాత అనుసరిస్తారు. పిదప ఆచరిస్తారు. అనుసృజన అనగా పై అనుభవాలను, తమ సృజనాత్మకతను జోడించి వారొక పంథాను ఏర్పరచుకుంటారు. ఎవరైనా గమనించి గ్రహించేదే ఎక్కువ. **“యద్యదాచరతి శ్రేష్ఠః..”** అని గీతాచార్యుని వాక్యమే దీనికి ప్రమాణం. కనుక పెద్దలమనబడే మనమే ఆదర్శమూర్తులుగా మారాల్సి ఉన్నది.



ప్రస్తుత భారత సమాజం కొన్ని సంస్కృతీపరమైన సవాళ్ళను ఎదుర్కొనుచున్నది. స్వాతంత్ర్య సమరంలో యావద్భారతదేశాన్ని ఉగ్రూతలూగించి, దేశభక్తికి, ప్రతీకగా నిలిచిన బంకించంద్రుని "వందేమాతరగీతం" పాడుటకే అభ్యంతరపడేవారు ఉన్నారు. భారతీయ సంస్కృతికి భారతీదేవి (సరస్వతి) విద్యాదేవత. "సరస్వతీ ప్రార్ధన" విద్యాలయాల్లో చేయకూడదని, అది ఒక మత ప్రార్థన అనే సంకుచిత భావన కూడా లేకపోలేదు. భారతీయతకు ప్రతీకలైన కట్టు, బొట్టు, జుట్టులను మనమే కించపర్చుకునే దుస్థితికి జాతి దిగజారుతున్నది.

భారతీయ జీవన విధానాన్ని ప్రపంచ దేశాలన్ని గుర్తించి గౌరవిస్తూ ఉన్నాయని మీకు తెలుసు. దీనికి కారణం ఇది ఋషిప్రోక్తమైన జీవన విధానము. మతములకన్నా ఇది ఉన్నతమైన విశాలదృక్పథం కలది. తల్లిదండ్రులను, గురువులను, అతిథులను దైవ సమానంగా భావించు సంస్కృతి మనది. ఇచ్చట కుటుంబ జీవనం, వివాహ వ్యవస్థ, ఆచార వ్యవహారాలు, సాంప్రదాయములు, పండుగలు, మొదలగువాటిలో ఒక శాస్త్రీయత ఉన్నది. నైతిక విద్య యొక్క పరిధి చాలా విశాలమైనది. మానవుని యొక్క శారీరక, మానసిక, ఆధ్యాత్మిక సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడే ప్రతి అంశము నైతికవిద్యలో భాగమని చెప్పవచ్చును.

**–'మన విలువలు' నుండి**

## ఆ చేయి ఎంత హాయి

**నా ప్రశ్న :** బాబాను సుళువుగా పట్టుకోవడానికి సులభమైన ఉపాయముంటే చెప్పండి సార్... అని అడిగాను.

**గురువుగారు :** కొంచెంసేపాగి,... సద్గురువును యుక్తితో పట్టుకోవడం సాధ్యమౌతుందా! ఉపాయాలకు మన ఊహల పరిధికి ఆయన మనకు అందుతారా? భాగవతాన్ని చదివావా?

**నాతోనేను :** నా ప్రశ్నకు భాగవతానికి సంబంధమేమిటని నాలో నేననుకుంటూనే "స్వామి" ఎక్కడో ముడివేయబోతున్నారని భావించి "చదివానని" నెమ్మదిగా అన్నాను. ఎందుకంటే వారు చదివినంత చక్కగా, వారు అర్ధం చేసుకున్నంతగా నేను చదవలేదు. అర్ధం కూడా తెలియదు. వారి సునిశిత పరిశీలన ముందు నా విజ్ఞానమన్నది సముద్రంలోని కాకిరెట్ట వంటిదని ఆ తరువాత తెలిసింది. ఎందుకంటే వారు భాగవతార్ధాన్ని వివరించడమే కాకుండా, "పోతన" గారి ప్రయోగాలను, వారి వైరి సమాసాలను, పదనిర్మాణచాణతను, ప్రయోగించిన విధానమును వివరిస్తుంటే నేను తల వాల్చుకోక



తప్పలేదు. సిగ్గుపడిపోయాను. నా అవస్థను గమనించి నన్నింక ఇతరుల ముందు చిన్నబుచ్చటము వారికిష్టం లేకనేమో పదప్రయోగాలు, విశేషార్థాలను వారు చెప్పక నా ప్రశ్నకు సమాధానంగా హిరణ్యకశ్యపుని కథ చదివావా? అని అడిగారు.

**నేను :** చదివానని వినయంగా తలవంచాను. అందులో మళ్ళీ ఏమడుగుతారోనను సంశయం. వారు వివరిస్తుంటే శ్రవణోపేయముగా, సాహిత్యపిపాసకులను రంజింప చేస్తుంది. రసస్ఫూర్తిని కలిగింపచేస్తుంది. వారు చెప్పిన విశేషాలను విని ఆ తరువాత అనర్గళంగా అందరిముందు చెప్పి ప్రశంసలందుకున్నాను. కృషి గురువుగారిది – కీర్తి మా అందరిది. నేను చెప్పిన విషయాలన్నీ గురువుగారు చెప్పినవే. ఓ రోజున త్యాగరాజు కీర్తనలను వివరించారు. మరోసారి, తిక్కన పద ప్రయోగాలను వివరించారు. ఇంకొకసారి రాయలవారిని, తరువాత కంచెర్లగోపన్న (రామదాసు) ఇలా ఎన్నింటినో చెప్పేసరికి, ఆయన ఆధ్యాత్మిక ద్రష్టయా లేక సాహితీ కోవిదుడా? అనిపించి, ఈయన సవ్యసాచి అనుకున్నాను.

**ఎస్‌వీఎల్‌గారు :** "పండితులు" వారికి వేరే చెప్పాలా? అన్నారు.

**గురువుగారు :** చక్కని మందహాసాన్ని చేసారు.

**నేను :** నేను కూడా హాయిగా నవ్వుకున్నాను.

**ఎస్‌వీఎల్‌గారు :** నావైపే తదేకంగా చూస్తూ, "ఇతను మీరు భాగవతం చదివి ఉండరని అనుకున్నాడేమో"నన్నారు.

**నా ప్రశ్న :** అలాగైతే బాబా అనుగ్రహం పొందేదెలా?

**గురువుగారు :** నేను ముందే చెప్పానుగా, ఆయనమీద ఆధారపడటమే.

**నా ప్రశ్న :** ఆధారపడటమన్న విషయంలో అది అందరికీ సాధ్యపడేదేనా? మీలాంటి మహాత్ములకు, కారణజన్ములకుగాని...

**గురువుగారు :** నా మాట పూర్తి కాకుండానే అందుకున్నారు. (వారిని ప్రశంసించడం వారికి ఇష్టముండదు) మహాత్ములను, కారణజన్ములను ఉద్ధరించడానికే కాదు బాబా వచ్చింది, సామాన్యునికి కూడా ఆయన అనుగ్రహం లభిస్తుందయ్యా! బాబా చరిత్రను బాగా అధ్యయనం చేయి. శ్రద్ధగా చేస్తే ఎవ్వరికైనా అవగతమవుతుంది.

**నా ప్రశ్న :** అందుకు తగిన మార్గాన్ని సెలవీయండి స్వామి.



**గురువుగారు :** సాధన-భక్తి - నామజపం - ప్రేమ, శ్రద్ధ - మంచి హృదయభావన, ఇత్యాదులెన్నో ఉన్నాయి. అవన్నీ అనుగ్రహానికి మార్గాలే కదా!

**నా ప్రశ్న :** మంచి హృదయము - భావన - అంటే?

**గురువుగారు :** ఎదుటివారిని ప్రేమించడం, ద్వేషభావనను రానీయకుండా ప్రయత్నించడం. సహాయతా గుణము మొదలగునవి.

**నా ప్రశ్న :** అదెలా ఒనగూరుతుంది

**గురువుగారు :** త్యాగగుణము వలన.

నా జీవితమంతా ప్రశ్నార్థకంగానే మిగిలిపోతుందేమోనని అనుగ్రహించే విషయంగా ఆర్తి + ప్రేమల కలగలుపే త్యాగమని వివరించేందుకు, ఈ మట్టిబుర్రకు అర్ధమయ్యేందుకు ఓ చక్కని ఆఖ్యానాన్ని వివరించారు గురువుగారు.

ఆళ్వారులు పన్నెండుమంది. వారిలో 1. పొయిగై ఆళ్వారు 2. పూదత్తాళ్వారు 3. పేయాళ్వారు 4. ముదలాళ్వారులు. వారు ఒకే కాలానికి చెందినవారు, సమకాలీకులు. పొయిగై ఆళ్వారులు కీర్తన గావించుకొనుచు తిరుక్కొయిలూరు అనే గ్రామానికి సూర్యాస్తమయానికి చేరారు. ఉన్నపళంగా తుఫాను సంభవించేసరికి ఆళ్వారులు గ్రామ గమిడిలో ఖాళీగా ఉన్న చిన్న పూరిగుడిసెను చూచి అందులో తలదాచుకొను నిమిత్తముగా ఏగి అంతటి నిశీధిలోను భగవన్నామ సంకీర్తనమే చేస్తున్నారు. దీపపు కాంతి గూడా లేని కుటీరములో దట్టమైన చీకటి రాజ్యమేలుతున్నది. అలాంటి కటికచీకటి, భయంకరమైన పెనుగాలులు, జోరున వర్షంలో వెలుపలి నుంచి అయ్యా బయట వానగాలులు భయంకరంగా వీస్తున్నవి. తలదాచుకొనుటకు కొంచెము చోటివ్వగలరా అని అడిగినారు. పూదత్తాళ్వారు మాట విన్నంతనే పొయిగై ఆళ్వారులు తటాలున లేచి కూర్చొని, “అయ్యా! శీఘ్రముగా లోనికి రండు. ఒకడు సాగిలపడి పడుకోగల్గిన తావులో ఇద్దరు సుఖముగా కూర్చొనవచ్చును. రండు, దయచేయండని” ఆహ్వానించెను. ఆ కాళరాత్రిలో ఎవరికెవరో తెలియకుంది. ఇద్దరున్నారను విషయము తెలిసినా! ఎదుటి వారెవరనునది ఎవ్వరికీ తెలియదు. ఇలాంటి సమయంలోనే ‘అయ్యలారా’ వర్షమధికమౌతున్నది- తలదాచుకొనుటకు తగినంత తావీయగలరా అని! మూడవవ్యక్తి (పేయాళ్వారు) బయటనుంచి అడిగెను. చలిగాలికి, వర్షాధిక్యతను భరించలేక వణుకుచూ అడిగిన ఆ కంఠధ్వనిని విన్నంతనే తటాలున ఇద్దరూ లేచి నిలబడి రండి - దయచేయండి. ఇద్దరు సుఖముగా కూర్చొనుటకు



అవకాశమున్న ఈ గమిడిలో ముగ్గురు నిలబడవచ్చును. రండి – దయచేయండని స్వాగతించిరి. ఈ మువ్వురు ఒండొరులను ఆనుకొని నిలుచున్నారేగాని ఎవరికెవరో – ఎవరెవరో ఎవ్వరికీ తెలియదు. ముగ్గురూ నిలబడే ఉన్నారు. ఇంతలో నాల్గో వ్యక్తి వాకిట నిలబడి (ముదలాళ్వారు) ఆర్యా! బయటిబాధను భరించలేకున్నాను, లోనికి వచ్చుటకు అనుమతించగలరని అడుగగా, వాస్తవానికి నాల్గవ వ్యక్తికి చోటివ్వవలెనన్నచో ఎవరో ఒకరు వెలుపలికి రావలెను. ఇంతవరకు నేను లోపలున్నాను గదా! కొత్తవానికి చోటివ్వవలెను గదా! నేను బయటికి పోయి, వారికి తావిచ్చిన మంచిది గదా! ఇంతవరకు నేను వర్షబాధకు దూరమై విశ్రాంతి నొందితిని. ఆకలి తీరినవాడు ఆహారము మరుసటిరోజుకు దాచుకొనుట కంటే ఆకలితో వచ్చినవానికి అందించుట సాధుధర్మము గదా! కావున నేను వెలుపలికి పోవుట మంచిదనుభావము ఏక కాలములో మువ్వురికి కలిగెను. స్వార్ధరాహిత్యమున, కరుణరసము జాలువారునట్లుగా ఎవరికి వారే మరొకరి ప్రమేయం లేకుండా వెడలిపోయిరి. ఈ సంఘటన గమనించిన ముదలాళ్వారులు అయ్యో నా కోసము ఈ మువ్వురు ఇబ్బంది పడినారే. నా సుఖము కొరకు వీరు కష్టపడుట భావ్యమా? అని భావించి, అన్నలారా! మీరు బయటకు వెడలవలదు. నేను ఒక్కడినే. ఒక్కని కోసము ముగ్గురు నష్టపోరాదనుచుండగానే ప్రకృతి శాంతించి, విచిత్రరీతిన మారిపోయి వెలుగులు విరజిమ్మెను. ఇప్పుడు ఎవరికీ తలదాచుకొను అవసరము లేదు. **స్వార్ధరాహిత్యమైన ప్రేమకు నిదర్శనం గదా! ఈ సన్నివేశము**. బాగా ఆలోచించిన కొలది ఇందులోని త్యాగశీలత మనకు అర్ధం కాగలదు. మన సుఖం, మన స్వార్థం ప్రధానంగా భావించే వారికి త్యాగగుణములోని మాధుర్యం అర్ధం కాదు.

**నా ప్రశ్న :** ఆళ్వారులంటే అర్ధమేమిటి – జాతివాచకమా?

**గురువుగారు :** కాదు, కాదు. **ఆళ్వారులంటే లోతు తెలిసినవారని అర్థము**. భగవంతుని ఆరాధించుటలోని ఆనందములో “లోతుల”కు పోయిన వారని అర్థము. రామానుజుల గురించి తెలుసుగా!

**నేను :** పేరు వినటమేగాని, చరిత్రపరముగా తెలియదు.

**గురువుగారు :** మీ కృష్ణమాచారిగారితో ఎప్పుడూ ప్రస్తావించలేదా?

**నా ప్రశ్న :** వార్ని నేను అడగలేదు.

**గురువుగారు :** అడిగి చూడండి. మీ అయ్యవారేమంటారో (కృష్ణమాచార్యులవారు) రామానుజుల



గురించి.

**నా ప్రశ్న :** మీరు చెప్పండి సార్. మీరు చెపితే, నా హృదయానికి బాగా హత్తుకొని పోతుంది. చెప్పండి సార్, అని అర్థించాను.

**గురువుగారు :** శంకరాచార్యులవారిలోని పాండిత్యము, రామానుజులవారిలోని సామాజిక స్పృహలు గొప్పవి. దీన జనోద్ధరణ భగవదానుగ్రహం అందించు విషయంలో కులమతాలకు అతీతంగా సాగిపోయింది. ద్వయ మంత్రమహార్థాన్ని గ్రహించాలని రామానుజుల వారు గోష్ఠిపూర్ణనామాంతరులైన "తిరుకోష్టియూరునంబి" వారిని ఆశ్రయించేందుకై తిరుకోష్టియూరు వెళ్ళినారు. ఆ మహానుభావుని దర్శించి, పాదాబ్జములను శరణువేడి ద్వయమంత్ర మహార్థమును ఉపదేశించమని అర్థించారు. గోష్ఠిపూర్ణులు రామానుజుల శ్రద్ధను పరీక్షించదలచినవారలై పెదవి విప్పలేదు. ఈ రీతిగా పదునెనిమిది పర్యాయములు వెళ్ళిరావడం తటస్థించింది. రామానుజుల వారిలోని శ్రద్ధ, సబూరి, గోష్ఠిపూర్ణులకు ముచ్చటగొల్పి ఉపదేశానికి వచ్చే ముందు దండ, ధ్వజాలతో ఒంటరిగా రమ్మని ఆదేశించారు.

మరురోజు, కూరేశులను, దాశరథీయను వారలను వెంటబెట్టుకొని రామానుజులు వెళ్ళగా, గోష్ఠిపూర్ణులు గమనించి, నేను చెప్పినదేమి? నీవు చేసినదేమి? అని ప్రశ్నించారు. స్వామి తాము దండధ్వజాలతో రమ్మని నన్ను ఆదేశించారు. దాశరథీ నా దండము, కూరేశులు నాకు ధ్వజమని సమాధానమిచ్చారు రామానుజులు. గోష్ఠిపూర్ణులు హృదయము ఈ సమాధానానికి ఆర్ద్రత చెంది ముగ్గురికీ ద్వయ మంత్ర రహస్యార్థాన్ని వివరించారు.

ఈ రహస్యార్థాన్ని ఎన్నడు, ఎవ్వరికి, ఎప్పుడు ఎలాంటి సందర్భంలోనైనా వివరించవద్దని, అతి గోప్యముగా ఉంచవలసినదని ఆదేశించారు. గోష్టిపూర్ణులు అలానే వారిచేత ప్రతిజ్ఞ చేయించారు. ఎనిమిది అక్షరాలు, మూడు పదములున్న **"ఓం నమో నారాయణాయ"** అనే మంత్రాన్ని ఉపదేశంగా పొందారు రామానుజులు. ఈ మంత్రము ఉచ్ఛరించినందువలన, మంత్రార్థమును అర్థం చేసుకొనుటవలనను, మోక్షమన్నది సంప్రాప్తించునని గురూపదేశమై ఉన్నది. అట్టి మోక్షము ప్రత్యేక వ్యక్తులకు మాత్రమే పరిమితము కారాదన్నది రామానుజుల అభిలాష, అభిమతము గూడా. పై విధముగా జరిగినచో, వైష్ణవమత మహదాశయానికే మాయనిమచ్చ. భాగవతాచారానికే తీరని తప్పిదమని రామానుజుల వారు భావించారు. మరునాటి ఉదయం మహామంత్రమును ఆలయ గోపురపు పై భాగమునకెక్కి గ్రహించిన విజ్ఞానమంతటిని దాపరికం లేకుండా బహిరంగంగా



ప్రకటించారు– **"ఓం నమో నారాయణాయ"** అన్న మంత్రమును. ఈ వార్తెరిగి రామానుజులను తన సమీపానికి రప్పించారు గోష్ఠిపూర్ణులవారు. మంత్రార్థమును వివరించినందుకు, ప్రతిజ్ఞోల్లంఘనము గావించినందుకు మండిపడ్డారు, మందలించారు. ఈ నేరానికి ఫలితంగా నీకు నరకలోకము సంప్రాప్తిస్తుందనినారు. రామానుజులు ఏ మాత్రము కలత చెందక, కలవరపడక, కరాంజలి ఘటించి, సవినయముగా, సాదరముగా "స్వామి నాకు నరకమును గూర్చిన చింతలేదు. ఈ మహామంత్రార్థము వలన ఇంతమంది భగవంతుని సన్నిధిని చేరగల్గినపుడు నేను నరకానికి వెళ్ళితే మాత్రమేమనినారు. ఈ సమాధానం గోష్ఠిపూర్ణులవారిని కదిలించివేసింది. **తన వైష్ణవ పరిజ్ఞానమంతా సిద్ధాంతస్థాయిలో ఆరంభములోనే ఉంది. కాని రామానుజుల వారు తత్త్వస్థాయిని అనుష్ఠిస్తున్నారు. భగవంతుని అస్తిత్వాన్ని సామాన్య మానవునికి నిరూపించుతూ అందుబాటుబాటలో పయనించేలా చేస్తున్నాడనిపించింది గోష్ఠిపూర్ణుల వారికి.** ఏ సిద్ధాంతబలమైనా సర్వజనోపకారంగా సర్వులు అనుష్టించుటలోనే నిరూపితమవుతుందని భావించారు. గోష్ఠిపూర్ణులకు రామానుజుని హృదయము అవగతమై మూర్ధఘ్రాణముగావించి, ఆశీర్వదించి, "ఎంబెరుమానార్" అని వారిని సంబోధించారు. ఈ ఆఖ్యానము విన్నాక **శరద్బాబుజీగారు "సాయిఆళ్వార్"** అని అన్పించినది.

**నా ప్రశ్న :** బాబా ఒకప్పుడు వారిచ్చిన స్టేట్‌మెంట్‌ని ఈనాడు మిమ్మల్ని చూచిన తరువాత మార్చుకోవాలనిపిస్తుందనన్నాను. "ఏమా స్టేట్‌మెంట్?" ఉత్కంఠను రేపే ఆ సన్నివేశాన్ని రాబోయే సంచికలో చూద్దాము.

*– డా॥ ఎస్. సాయివరప్రసాదరావు, రేపల్లె.*

*హృదయం ప్రేమకు స్థానం. మనలో గల ప్రేమతోనే వారిలోగల ప్రేమను పొందగలం. వారి సాన్నిధ్యాన్ని శారీరకంగా కాక, హృదయంలో అనుభవించడం అభ్యాసం (సాధన) చేయాలి. మనం మనసుతో మాట్లాడుకోవాలయ్యా అంటారు శ్రీబాబూజీ. దీనికి ఒకటే మార్గం. నిరంతరం ప్రవహించే వారి ప్రేమ ప్రవాహాన్ని మన(సు)లోకి కాలువలు త్రవ్వుకోవాలి (మనసుని పల్లం చేసుకోవడమే పూజ యొక్క లక్ష్యం అంటారు శ్రీబాబూజీ). వారి నుండి ప్రసరించే వెలుగుకి అభిముఖంగా కూర్చోవడమే మనం చేయవలసింది. ఈ ఒక్కటి (ఒక్క అడుగు) చే(వే)యలేకనే మానవుడు యుగముల నుండి పడుతున్న బాధలు, సమస్యలు, దుఃఖాలు. ఈ కారు చీకటి గురువు యొక్క ప్రేమ అనే వెలుగులో మాయమవుతుంది.*



# సద్గురు సమ్మోహనం

ఆ రోజు సత్సంగం రాత్రి 11 గంటలకు ప్రారంభం అయింది. 12 గంటల సమయానికి ధైర్యం వచ్చింది. ఈ పాట పాడాను. తరువాత 1.30 గంటల కల్లా గురువుగారిని ప్రశ్న అడిగేదానికి ఇంకొంచెం ధైర్యం పుంజుకున్నా. నేను ప్రశ్నను ఆలోచించడంలో ఏమయిందంటే, నేను తెలుగులో కాకుండా ఇంగ్లీషులో ఆలోచించాను. ఈయన గురించి తెలిసిపోయింది. ఈయన ఇంగ్లీషు బ్రహ్మాండంగా మాట్లాడతారు. తెలుగు, సంస్కృతంలో అన్నింటిలో ఈయన బ్రహ్మాండమని నాకు గురువుగారి సంగతి తెలిసిపోయింది. నాకు ఎందుకొచ్చిందో ఐడియా, ఇంగ్లీషులోనే ప్రశ్న మైండ్‌లోనికి వచ్చింది. అందువలన ఇంగ్లీషులోనే ప్రశ్న అడుగుదాము, ఆయన కూడా ఇంగ్లీషులోనే సమాధానం చెబుతారు అనుకున్నాను. ఎందుకంటే అపుడు సత్సంగంలో గురువుగారిని కొందరు ఇంగ్లీషులో అడుగుతున్నారు. కొందరు తెలుగులో అడుగుతున్నారు. కానీ నేను ఇంగ్లీషులోనే ప్రశ్నను మననం చేసుకున్నాను. నా ప్రశ్నకి ఈయనైతేనే సమాధానం చెప్పగలుగుతారు, అది ఎట్లా సమాధానం చెబుతారో అని ఆలోచిస్తూ ప్రశ్న వేశాను.

నేను ప్రశ్న అడిగేముందు నాకు అప్పటికి పూర్తిగా నమ్మకం లేకపోయినా గురువుగారిని “భగవాన్” అని పిలిచాను. కేవలం గౌరవ వాచకంగానే అన్నాను. అంతేకాని ఆయన ఆధ్యాత్మిక శక్తి తెలిసికాదు. ఏదో గౌరవవాచకముగా, పెద్దమనిషిలా ఉన్నారు, బాగా తెలివితేటలు గలవారు అని భగవాన్ అని అందాములే మనదేం పోయింది అని పిలిచాను. నిజం చెప్పాలంటే నా మనసులో ఉన్నది అది. భగవాన్ అని పిలిచి ఇంగ్లీషులో అడిగిన ప్రశ్న. "Is it correct, the concept and philosophy of Sai Baba is to make this world irreligious?" అది నేను అడిగినది. గురువుగారు వెంటనే ఠక్కుమని ఒక 5 సెకండ్స్ కూడా ఆలస్యం చేయకుండా ఇంగ్లీషులోనే ఆయన It is not exactly correct that concept and philosophy of Sai Baba is beyond religion అని సమాధానమిచ్చారు. ఇక అంతా నేను చెప్పిందే రిపీట్ చేసారు. నేను ఆశ్చర్యపోయాను. అది ఎటువంటి సమాధానం అంటే, అది ఆలోచించేకొద్దీ, దానిలో ఉండే అంతరార్థం నాకు ఉండే సందేహాలన్నింటినీ మొత్తం భస్మీపటలం అయిపోయేటట్టు ఉంది. నేను ఒక కమ్యూనిస్ట్‌ని. ఒక యోగమార్గంలోకి తిప్పేటటువంటి ప్రశ్న అది. ఆయన సమాధానంతో నా మనసులో ఉండే మొత్తం సందేహాలను తీర్చేసారు. ఆయన ఇంగ్లీషులో సమాధానం చెప్పి, మరలా తెలుగులో వివరించారు.

“అయ్యా, నువ్వు ఫస్ట్‌క్లాస్ కంపార్టుమెంట్‌లో పోతున్నావు, సెకెండ్ క్లాస్, థర్డ్ క్లాస్ కంపార్ట్‌మెంట్లలో ఏమి జరుగుతుంటే దాని గురించి నీకెందుకు? ఈ సాయిబాబా ఫిలాసఫీ అనేది ఏ మతానికీ



సంబంధించినది కాదు, మతాతీతమైనటువంటి సిద్ధాంతం సాయిబాబాది. ఏ మతంతో విరోధం లేదు, ఏ మతంతో విదితం లేదు. అందుకనే ఆయన వివరించినది. మనం ఫస్ట్‌క్లాస్, ఈ మతాలన్నీ సెకెండ్, థర్డ్ క్లాస్. వాటిని గురించి మనకు ఎందుకు గొడవ! మన ఫిలాసఫీ హయ్యర్ లెవెల్. సాయిబాబా ఫిలాసఫీ మతాతీతమైనటువంటిది. మానవులంతా ఒకటే అనే కాన్సెప్ట్ ఆయనది. ఈ మతాలు, కులాలు అన్నీ ఏవీ లేకుండా ఉండేటటువంటి ఫిలాసఫీ. సాయిబాబా దృష్టిలో ఈ మతం లేదు, కులం లేదు. ఏమీ లేవు. ప్రశ్న ఏమిటంటే "సాయిబాబా వేదాంతం మతాల్ని లేకుండా చేయడానికా?" అని నేను కావాలనే అడిగాను ఆ ప్రశ్న. బహుశా ఆయన ఆ ఉద్దేశ్యంలోనే ఇదంతా చేస్తున్నాడేమోనని. కానీ గురువుగారు ఏం చేసారు, రక్కుమని మొత్తం ఇదంతా ఎగరగొట్టేసి, 'నీకెందుకయ్యా మతాల సంగతి, మనం అంతా హై లెవెల్‌లో పోతుంటే మనకెందుకు ఇవన్నీ' అని ఒక్క దెబ్బతో మొత్తం కొట్టేశాడు. గురువుగారి సమాధానంకి నేను చాలా ప్లీజ్ అయిపోయాను. ఇది నేను సత్సంగంలో రాత్రి 1.30 సమయంలో అడిగాను. వేకువఝామున 3 గంటల వరకు జరిగింది సత్సంగం. సత్సంగం 3 గంటలకు అయిపోయిన తరువాత ఆయన లేచి వెళ్ళిపోతూ ఒక్క మాట అని వెళ్ళిపోయారు. నేను చాలా ఆశ్చర్యపోయాను ఆ మాటకి. వెళ్ళిపోతూ ఏమన్నారంటే.. **"ఇక్కడకు వచ్చినటువంటి మూడువేల మంది గురుబంధువుల మనసుల్లో, హృదయాల్లో ఏముందో అంతా నాకు బాగా తెలుసు"** అని లేచి వెళ్ళిపోయారు.

నేను ఆశ్చర్యపోయి, ఏంటి ఈయన అంత సమర్థుడా! భగవంతుడు మాట్లాడినట్లు మాట్లాడుతున్నారే, సాయిబాబా మాట్లాడినట్లు మాట్లాడుతున్నారే, అంత గొప్పవారా! అంత పవర్ ఉందా ఈయనకి అనుకున్నాను. ఎందుకంటే ఆయన ఆధ్యాత్మిక శక్తి అప్పటికి నాకు తెలియదు కదా! నేను ఇంకా అజ్ఞానంలోనే ఉన్నాను. అప్పటి నా స్థితి అది. గురువుగారు చెప్పిన మాటకి నాకు ఒళ్ళు గగుర్పాటు పొడిచి, ఈయన ఇట్లా చెప్పి, వెళ్ళిపోయారు కదా! అంటే, నా మనసులో ఏముందో, నా హృదయంలో ఏముందో ఈయనకి తెలుసు కదా, ఇక రేపటి నుండి ఎవరినైనా, ఏమైనా అడగడం దేనికి? ఇక ఆ అవసరం లేదు. మన మనసులో అనుకుంటే ఆయనకి తెలిసిపోతుంది కదా! ఆయన చేసేస్తారు కదా! చేసెయ్యాలి కదా! ఇక్కడ ఒక పాయింట్ ఉంది. అది సబబయిన కోరికగా ఉండాలి. నాకు యాభైకోట్లు ఇవ్వు స్వామీ అంటే అది సబబయిన కోరికా? పదివేలు ఇవ్వు స్వామీ అని అడిగితే, నేను దేనికి డిసర్వింగ్ పర్సనో అంతవరకు అడిగితే సరి. పదికోట్లు ఇవ్వమని అడిగితే అది మంచిది కాదు. అలాంటిదానికి ఆయనెలా రెస్పాండ్ అవుతారు! ఆయనకు పవర్ లేక కాదు, పదికోట్లు



ఇచ్చేవాడికి పదికోట్లు కూడా ఇస్తారు. పదివేలు ఇచ్చేవారికి పదివేలే ఇస్తారు. అది మన స్థితిని బట్టి మనం చూసుకోవాలి, కానీ ఆయన పవర్‌ని మనం బేర్ చేయలేం. కానీ, ఆయనకి మనసులో ఉన్నది తెలుస్తుంది కాబట్టి, ముందు మనం చిన్న కోరికతో ప్రారంభిద్దాం అనుకున్నాను. నేను అప్పుడు భజనలో ఉండేవాడిని, కానీ భజన చెప్పేవాడిని కాదు. గురువుగారికి భజనంటే ఇష్టం అని చెప్పారు కాబట్టి రోజూ కొద్దిసేపు భజనలో కూర్చొని వెళుతుండేవాడిని. ఒకరోజు నాకు ఎందుకో బుద్ధి పుట్టింది. ఇక్కడ సత్సంగం హాలులో బాబా నామం చెప్పాలని. మనుసులో కోరిక వచ్చింది. స్వామీ! నాకు ఇక్కడ నామం చెప్పేటట్లు అనుగ్రహం ఇవ్వండి. నేను వాళ్ళనిగాని, వీళ్ళనిగాని, ఎవ్వరినీ అడగను. నాకు నామం చెప్పే ఛాన్స్ దొరికేటట్లు చేయండి స్వామీ అని అడిగా (మనసులో). చాలా చిన్న కోరిక కదా అది! కానీ నేను పెద్ద కోరిక క్రింద లెక్కేసుకున్నాను.

నేను భజన చెప్పలేనివాడిని, కానీ మొదటిసారి చెప్పడానికి చూస్తున్నాను. ఈయనకి పవర్ ఉందన్నాడు. మనసులో, హృదయంలో ఏముందో తెలుసన్నాడు. నా హృదయంలో ఇది వచ్చింది, దీనికి ఆయన రియాక్ట్ కావాలి కదా! అది నాకు జరగాలి కదా! అని ఇలా రకరకాలుగా నా మనసులో తర్జనభర్జన పడుతున్నాను. ఆ రోజు కూడా అక్కడ భజన జరుగుతుంది. తెనాలివాళ్ళు ఒక పదిమంది వచ్చి కూర్చొని భజన చేస్తున్నారు. నేను భజనలో మామూలుగానే వెనుక కూర్చునేవాడిని. అలాగే ఆరోజు కూడా వెనుకగా కూర్చొని కోరస్ చెబుతున్నాను. నేను వెళ్ళి కూర్చొన్న రెండు, మూడు నిమిషాలకి ఆ భజన చెప్పే అతను భజన నిలిపేసి, సార్! నేను చెప్పలేకపోతున్నాను, ఎవరైనా చెప్పేటట్లుంటే చెప్పండి అని అన్నాడు. ఆశ్చర్యం! చూడండి అది నాకు ఆహ్వానం కదా అనిపించింది. అక్కడ కూర్చున్న వారినందరినీ అతనే పిలుస్తున్నాడు, కానీ ఎవ్వరూ ముందుకు రావడం లేదు. అప్పుడు నన్ను చెప్పమంటారా! అని నేను అడిగాను. వాళ్ళు నాకు అవకాశం ఇవ్వలేకపోయారు. ఈయనకేమి చేతనవును భజన చెప్పడానికి అని. అయినా సరే, ముందుకు వస్తున్నాడు. అసలు భజన లేకుండా ఉండేదానికన్నా ఏదో చెప్పినంతవరకే చెప్తాడులే అని వారు సర్దుకున్నారు. సరే, మనకి ఛాన్స్ వచ్చినట్లుంది అనుకొని నేను భజన మొదలుపెట్టి చెప్పాను. నాకు కొంచెం సంగీతం తెలుసు కాబట్టి రాగయుక్తంగా వాళ్ళందరూ చెప్పేదానికంటే కొద్దిగా బెటర్‌గానే చెప్పాను. నేను అలా నామం చెప్పేసరికి వాళ్ళందరూ ఆశ్చర్యపోయారు. మీరు ఇంత బాగా చెబుతారని మాకు తెలియదయ్యా అని ఆ తర్వాత వాళ్ళే అన్నారు. అలా నా మొదటికోరిక తీరిపోయింది.

– 'నామం' జగన్మోహన్‌రెడ్డిగారు



# గురుకృపాలహరి

"ఎక్కడి మానుష జన్మం బెత్తిన ఫలమేమున్నది నిక్కము నిన్నే నమ్మితి నీ చిత్తింబికను" అంటారు శ్రీఅన్నమాచార్యస్వామి. దుర్లభమయిన మానవజన్మము లభించినా, మనిషి తన మానసాన్ని దైవానికి సమర్పించుకోలేని నిస్సహాయస్థితిలో ఉండిపోతున్న క్షణాల్లో దైవం - ఈ భూమికి గురుస్వరూపంగా వేంచేసి ఇహపర శ్రేయోదాయకంగా మానవజీవితాలను ఎలా మలుచుకోవాలో తెలియచెపుతున్నారు. ఆహారాన్ని, ఇంద్రియభోగాన్ని, ధనాన్ని, బంధాల్ని మాత్రమే జీవితమని నమ్మి, మరో మార్గంలేదన్న మాయలో జీవించి, చీకట్లలో మ్రగ్గిపోతున్న 'మనిషి'ని - సమున్నత సత్యంవైపు, సర్వజీవ స్వరూపమైన దైవమనే వెలుగులవైపు చేయిపట్టి నడిపించడానికి, జన్మజన్మలుగా వెంటపడి మరీ మనలను గమ్యం చేర్చే ఏకైక కరుణాస్వరూపం 'గురువు'. సంస్కరించడానికి, ఉద్ధరించడానికి, సద్గతిని అందించడానికి ఈ అవనికి అరుదెంచే గురుచంద్రులు సద్గురుపథగాములకు నిజమైన చుక్కానులు, దీపస్థంభాలు, ప్రతీ'కల్పం' (యుగం)లోను ఆర్తుల అవసరాలను తీర్చి, సజ్జనులకు సాంత్వన చేకూర్చి, ఆశ్రితులకు నీడనిచ్చే వృక్షాలుగా విలసిల్లారు. **"ఈ శతాబ్దపు నిజమైన సన్యాసి"**గా శ్రీదలైలామాగారిచే కీర్తించబడ్డ పూజ్యపరమాచార్యస్వామి చరితం మనం సంస్కరింపబడటానికి, గురువు-మనలను ఉద్ధరించే క్రమాన్ని తెలపడానికి, సద్గురుచరణాలను చేరి సద్గతి నొందడానికి అనవరతం ఆదరువు కాగలదు.

పరమాచార్య పద ప్రస్థానంలో వారి అడుగులతో పవిత్రమైన ప్రాంతాలను మానస దర్శనం చేసే క్షణాల్లో మనం నివసించే ప్రాంతాలు కూడా ఉన్నాయని తెలిసిన క్షణాలు మధురాతి మధురాలే కదా! ఇక స్వామివారి యాత్రలోకి... విశాఖలో జరిగిన విద్వత్‌సభలోనూ, వలసిన సందేశాన్ని తమ అనుగ్రహభాషణంలోనూ ఇక్కడి పురప్రజలకు తెలియచెప్పి, దిశానిర్దేశం చేసారు స్వామి. డిసెంబరు 3వ తేది, 1936వ సం॥ విశాఖ నుండి బయలుదేరి అగనంపూడి మీదుగా స్వామి కశింకోట చేరుకున్నారు. నాలుగు, ఐదు తారీఖులు అక్కడే ఉండి ఆరవతేదీ చోడవరం చేరుకున్నారు. దగ్గరలోని వెదురుపర్తి గ్రామంలో కొన్ని కుటుంబాలు వేదపరిరక్షణకు, వేదాధ్యయానికి ఇచ్చిన ప్రాధాన్యతను గమనించిన స్వామి ఆ గ్రామాన్ని దర్శించారు. డిసెంబర్ 21వ తేదీన యలమంచిలి పురవాసుల స్వాగత సత్కారాలతో, భిక్షావందన, పాదపూజా విశేషాలతో స్వామి తమ చరణస్పర్శతో యలమంచిలిని



పునీతం గావించారు. రెండు వారాల వారి విడిదిలో ఎందరో పండితులు, పామరులు, స్వామివారి దర్శనం, చంద్రమౌళీశ్వర సేవలో తరించారు. జనవరి 11వ తేదీ, 1937వ సం॥ స్వామివారు ధర్మవరం, గొల్లప్రోలు, నక్కపల్లి మీదుగా తుని చేరుకున్నారు. అక్కడి రాజు వెంకట నారాయణ గజపతిరాజా బహదూర్ స్వామివారికి స్వాగతం పలికారు. 65వ పీఠాధిపతులైన మహాదేవేంద్ర సరస్వతీ స్వామివారు కూడా తుని వేంచేశారని గుర్తు చేసుకొని పరమానంద భరితులయ్యారు రాజు, పురజనులు. పదిరోజుల విడిది తరువాత తొట్టంగి, అన్నవరం, గొల్లప్రోలు మీదుగా జనవరి 28వ తేదీ పిఠాపురం చేరారు స్వామి. స్వామివారి ఆగమనానికి గుర్తుగా విశేషమైన ఉత్సవం జరిగింది. త్రిమూర్తులు గయాసురుడనే రాక్షసుని సంహరించగా బీహార్‌లోని గయలో శిరస్సు, ఒరిస్సాలోని జాజ్‌పూర్‌లో నాభి, ఆంధ్రప్రదేశ్‌లోని పిఠాపురంలో పాదాలు పడడంతో ఈ మూడు క్షేత్రాలను శిరోగయ, నాభిగయ, పాదగయగా పిలుచుకుంటారు. పాదగయలో స్వామి పవిత్ర స్నానమాచరించాక అక్కడ స్వయంభువుగా వెలిసిన శ్రీకుక్కుటేశ్వరుని, శ్రీపురుహూతికా అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ క్షేత్రాన్ని అష్టాదశ శక్తిపీఠముగా కొలుస్తారు. శ్రీపాదలక్ష్మీనరసింహశాస్త్రిగారి ఆధ్వర్యంలో పండిత సభ జరిగింది. ఎందరో విద్వాంసులు స్వామివారి అనుగ్రహ సత్కారాలను అందుకున్నారు.

స్వామివారు తర్వాత తమ శ్రీచరణాలతో కాకినాడ పట్టణాన్ని పునీతం గావించారు. అక్కడ తుల్యగోదావరిలో చొల్లంగి అమావాస్యనాడు పవిత్ర స్నానమాచరించారు. గోదావరినది ఏడుపాయలలో ఒకటైన ‘తుల్యభాగ’ చొల్లంగిలో సముద్రంలో కలుస్తుంది. అదేరోజు స్వామివారు ద్రాక్షారామక్షేత్రాన్ని దర్శించి, ప్రత్యేక పూజలు సలిపి భీమేశ్వరునికి, మాణిక్యాంబకు పట్టు పీతాంబరాలు, పట్టుచీరలు సమర్పించారు. దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన క్షేత్రం ద్రాక్షారామం. దక్షప్రజాపతి యజ్ఞం చేసిన కారణంగా ఈ పేరు వచ్చిందని స్థల పురాణం. భీమేశ్వరుని వంటి దైవం, దక్షుడు యజ్ఞం చేసిన ధామం, సప్తగోదావరిలాంటి తీర్థం జగత్తులో అరుదని స్కాందపురాణం చెపుతోంది.

మార్చి 1వ తేది స్వామి కోటిపల్లి క్షేత్రదర్శనం చేసారు. ఇంద్రునిచే యోగలింగమైన కోటేశ్వరస్వామి, చంద్రునిచే భోగలింగమైన సోమేశ్వరస్వామి ప్రతిష్టించబడి, కశ్యప మహర్షిచే శ్రీదేవి, భూదేవి సహిత జనార్ధనస్వామివారు ప్రతిష్ఠించబడినట్లు ప్రతీతి. ఇక్కడ గౌతమీనదిలో స్వామి పుణ్యస్నానమాచరించారు.



ఆదిశంకరులు కూడా ఇక్కడకు వేంచేసినట్లు మరో చారిత్రక కోణం. దేవాలయ అధికారులు పరమాచార్యులకు వలసిన మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి యాత్ర సప్తగోదావరీ ప్రాంతం మీదుగా కొనసాగింది. కోనసీమలో వారి యాత్రాక్రమంలో ఎందరో భక్తులు చంద్రమౌళీశ్వర పూజను దర్శించి తరించారు. డెల్టా ప్రాంతంలో జరిగిన వారి యాత్రలో ప్రతీరోజు స్వచ్ఛ తెలుగులో 'ధర్మం'పై జరిగిన వారి అనుగ్రహభాషణాలు ఆ ప్రాంతవాసులను ఆనందసంద్రలో ఓలలాడించాయి. 1937వ సం॥ మే నెలలో శంకరజయంతి కౌశికి నదీ తీరం ముక్కామలలో ఉత్సవంలా జరిగింది. అద్వైతతత్త్వంపై, ఆదిశంకరుల జీవితంపై అనుగ్రహభాషణాలెన్నో జరిగాయి. ఈ యాత్రాక్రమంలో ఆ సంవత్సరం గురుపూర్ణిమ పాలకొల్లులో జరిగింది. జూలై 23వ తేదీ 1937 నుండి సెప్టెంబరు 20వ తేదీ 1937 వరకు స్వామి పాలకొల్లులో ఉండి, వారి చాతుర్మాస్యవ్రతాన్ని పూర్తి చేసారు. తర్వాత పోలవరం, కొవ్వూరు మీదుగా ఒకటి అక్టోబర్ నాటికి రాజమహేంద్రవరం (రాజమండ్రి) చేరుకున్నారు. సభక్తికంగా, వినయపూర్వకంగా రాజమండ్రి వాసులు స్వామికి స్వాగతం పలికి పీఠ పరివారానికి కావాల్సిన అన్ని ఏర్పాట్లను చేసారు. ఆ కాలంలో పాపికొండల సహజసౌందర్యాన్ని స్వామివారు పడవలో ప్రయాణించి దర్శించారు. కాకినాడలో మహోదయ పవిత్ర సమయం జనవరి 31, 1938నాడు సముద్రస్నానం చేసాక గోదావరీ పరీవాహకంగా సాగిన స్వామివారి యాత్ర మార్చి నెల నుండి కృష్ణా పరీవాహకంగా సాగింది ఆంధ్రదేశంలో. 1938వసం॥ శంకరజయంతి భీమవరంలో విశేషంగా జరిగిన తర్వాత స్వామివారు విజయవాడ చేరుకున్నారు. కృష్ణానదీ స్నానమాచరించాక స్వామివారు కనకదుర్గను దర్శించుకున్నారు. శ్రీచరణుల పాదధూళి తలనిడి దేవస్థాన అధికారులు, పురప్రముఖులు, ప్రజల స్వాగత విశేషాలతో విజయవాడ పులకించింది. వారం రోజుల విడిది అనంతరం స్వామివారు మంగళకర క్షేత్రం మంగళగిరిలో కొలువైన లక్ష్మీనృసింహస్వామివారిని దర్శించారు. త్రేతాయుగకాలం నుండి ఐతిహ్యం కలిగిఉన్న ఈ నరసింహుని విశేషాలు ఎన్నో. ఇక్కడి నారసింహుడు-నివేదన చేసిన పానకాన్ని కొంత స్వీకరించి, మిగిలినది భక్తులకు ప్రసాదంగా అందిస్తారన్నది భక్తజనుల విశ్వాసం.

స్వామివారు ఇక్కడినుండి కొవ్వూరులోని సంస్కృత పాఠశాలకు వేంచేసి అక్కడి బోధనాపద్ధతులను అడిగి తెలుసుకొని, విద్యార్థులకు, బోధనాచార్యులకు సలహాలను, సూచనలను అందించారు. జటావల్లభ పురుషోత్తం పంతులుగారి స్వాగతోపన్యాసము తర్వాత స్వామివారి అనుగ్రహ



భాషణామృతంలో ఆస్తికజనులు తరించారు. గుడివాడ, కపిలేశ్వరం, తెనాలి మీదుగా చాతుర్మాస్యదీక్షకై స్వామివారు గుంటూరు నగరం చేరుకున్నారు. స్వామివారి కరకమలాలతో సాగే చంద్రమౌళీశ్వర సేవలను వేలాదిమంది దర్శించుకునేందుకు వీలుగా పెద్ద మండపం నిర్మించబడింది గుంటూరు పట్టణంలో. ప్రతీరోజు విద్వత్ సభలతో, జిజ్ఞాసాసువుల శోభతో అలరారింది స్వామిసన్నిధి. అఖిలాంధ్ర ధార్మిక పండిత్తుపరిషత్ వారు స్వామి చరణాలకు నూట ఏడు శ్లోకాలతో అక్షరార్చన చేసుకున్నారు. అది గ్రంథంగాను వెలువడింది. చాతుర్మాస్యనంతరం మార్కాపురంలో స్వామివారిచే నవరాత్రి ఉత్సవాలు భక్తిపూర్వకంగా సాగాయి. నవంబర్ 1938వ సం॥ నుండి జనవరి నెల 1939వ సం॥ వరకు పరమాచార్యస్వామివారు నెల్లూరు పట్టణంలో విడిది చేసారు. నెల్లూరు పురప్రజలు, చుట్టుప్రక్కల గ్రామప్రజలు స్వామివారికి, పీఠ పరివారానికి వలసిన ఏర్పాట్లు చేసి, తాము కూడా చంద్రమౌళీశ్వరుని దర్శించుకుంటూ తరించారు. వెంకటగిరి మహారాజుగారి వినయపూర్వక అభ్యర్ధన మేరకు ఫిబ్రవరి 6వ తేదీనుండి మార్చి 25వ తేదీ 1939వ సం॥ వరకు వెంకటగిరిని పునీతం గావించారు స్వామివారి పదస్పర్శతో. కోడూరు, నాయుడుపేట మీదుగా అల్లాడిలో విడిది చేసారు. ఏప్రిల్ 1939వ సం॥ రెండవసారి శ్రీచరణులు శ్రీకాళహస్తి, తిరుపతికి వేంచేసి ప్రకృతి రమణీయ ప్రాంతం బుగ్గలో విడిదిచేసారు. ఏడువసంతాలకు పూర్వం ఇక్కడనే స్వామి ఆదిశంకరుల విగ్రహాన్ని ప్రతిష్ఠ చేసారు కదా!

**కరచరణాదులతో దైవం గురువుగా మన మధ్యలో తిరుగాడిన ఆ క్షణాలు ప్రాతఃస్మరణీయాలే! ప్రజల అజ్ఞానాంధకారాలను హరించడానికి అనంత కృపాళువుగా గురువు విలసిల్లే సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం సాధకుల విధి. మా గురుదేవులు శరశ్చంద్రుల చరణస్పర్శను ఎంత తలచుకున్నా తనివితీరదు. జ్ఞానప్రేమ సమ్మిళితమై మాకై అవతరించిన అనంత అనుగ్రహాంశ శ్రీశరత్‌బాబూజీ. వారి ప్రతీ మాట మాకు వేదమే. వారు చూపిన ప్రతీ బాట మాకు శిరోధార్యమే. మేధకు మేరులేని అనంత జ్ఞానమూర్తి వారు. కరుణకు వరిష్ఠ స్వరూపులు వారు. 'గురుకృపా' విశేషమే మహితాత్ముల, సత్యద్రష్టల సద్దర్శనము, సచ్చరిత్రల సందర్శనము. మానవాళికి గురువేగతి. సద్గురుచరణాలను గట్టిగా పట్టుకుంటే పొందగలము 'ఆనంద'మనే స్థితి. సద్గురు చరణం... శరణం.. శుభం భవతు.**

**– గురుకృప**



అవ్యాజ ప్రేమ స్వరూపా!
ఎన్ని జన్మల కరుణానుబంధమో మీ పదం చేరాము!
శ్రీసాయి ప్రేమ పరమాన్నంతో మీరు చేసిన అన్నప్రాసన మాకు ‘జీవించే’ శక్తినిచ్చింది.
తప్పటడుగులు వేసే వేళ మీ సద్భావనా తలపులు మా ‘అడుగు’లను సరిదిద్దాయి.
వర్షించిన సాయి అనుగ్రహంలో, మీరున్నారన్న కొండంత అండలో మా జీవితాలు నిత్యకళ్యాణాలయ్యాయి.
మీ అవ్యాజ అనుగ్రహ అనుభవ లీలాకాశంలో మా ‘వెతల’కు మీ రూపం ‘వెలుగ’య్యింది.
మీ సుజ్ఞాన హిమశిఖరపు జిజ్ఞాసా పవనాలు మాకు నిత్యహరితాలయ్యాయి, ‘సత్’పథం చూపాయి.
మనిషిని మనిషిగా ఎలా చూడాలో నేర్పిన మీ మహిత మార్గం, మాకు దైవంగా ఎదిగే స్ఫూర్తినిచ్చింది.
మీరు అర్ధమయిన ఆ క్షణాన, కేరింతలు కొట్టే ఆ వేళ
పూర్ణత్వంలో పరమాణువును తెలుసుకున్నావని చెప్పే “మీ చిరునవ్వు”
మరల ఎప్పుడా అన్నప్రాసన, మీ అమృత చరణోపాసన అన్న
కుతూహలపు క్రొత్త పూవులు పూయిస్తోంది...

-గురుకృప-





మీ సాన్నిధ్యభాగ్యం లభించే ఆ క్షణాల కోసం యుగాలుగా గడుస్తున్న ఘడియలను లెక్కిస్తున్నాను.
సాయినాథుని అనుగ్రహానికి సాకారమై ధవళ వస్త్ర శోభలో సరళ గంభీరంగా
పద్మాసనస్థులైన మిమ్మల్ని తనివితీరా చూడాలని ఎదురుచూస్తున్నాను.
సమయం ఆసన్నమయింది. మీ సన్నిధి సంప్రాప్తమయింది.
అవ్యక్త ప్రశ్నలేవో సమాధానపడుతున్నాయి.
ఆ అనుభవాలు పదాల పరిధులకు అందడం లేదు.
ఎలా ప్రతిస్పందించాలో తెలియక, ఏ స్పందనా లేకుండా ఉండిపోలేక,
మీ పాదాలు తాకి, మీ వర్చస్సు వెలుగులను సంభ్రమంగా చూస్తూ ఉండిపోయాను.
కళ్ళ ముందర మీ రూపం మెల్లగా ఏదో మృదుత్వంలోనికి కరిగిపోయింది.
మూలానికి మూలమైన ఏ స్థానాన్నో చేరుకున్నట్లనిపిస్తోంది.

- భీమ్ -
Geoff Dowson

